
# ఆనందో బ్రహ్మ

సాయి బ్రహ్మానందం గొర్తి





శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 21



# ఆనందో



# బ్రహ్మ

## నెలనెలా నవ్వుల విందు

## తెలుగు వారమండీ...

భారతదేశ రాజధానిలో ఒకసారి ఓ సాంస్కృతిక ఉత్సవం జరుగుతోంది. ఉత్సవంలో దేశంలోని అన్ని రాష్ట్రాలూ పాల్గొన్నాయి. అక్కడ "మీరు - మీ సంస్కృతి' అనే పోటీ ( రిపబ్లిక్ డే పెరేడ్ లాంటిదే ) పెట్టారు. . ఈ పోటీలో ఎవరి సంస్కృతిని వారు ఎంతగా ప్రతిబింబిస్తే ఆ రాష్ట్రానికి అయిదు, మూడు, రెండు కోట్ల రూపాయిలు బహుమతులుగా ప్రకటించారు. ప్రతీ సంస్కృతిలో ప్రముఖుల గొప్పతనాన్ని చాటుతూ ప్రదర్శన ఇవ్వాలి. సాంస్కృతిక పోటీ అంటే తమిళనాడు, బెంగాలీలు,, ఒకళ్ళేమిటి దేశంలోని ప్రతీ రాష్ట్రం వారు పాల్గొన్నారు. ఇందులో బెంగాల్ వాళ్ళు రవీంద్రనాథ్ ఠాగోర్ని, సుబ్రహ్మణ్య భారతిని తమిళవాళ్ళూ, ఇలా ప్రతీ రాష్ట్రం వారి వారి సంస్కృతిలో ప్రముఖ వ్యక్తుల్ని కొనియాడారు. ఈ పోటీలో తమిళనాడు రాష్ట్రానికి మొదటి, బెంగాల్ రాష్ట్రానికి రెండవ, మహారాష్ట్రకి తృతీయ బహుమతులు లభించాయి. ఈ పోటీలో ఆంధ్ర రాష్ట్రం తరపున ఒక్కరూ పాల్గొనకపోవడం ప్రతీ తెలుగు వాడిని ఆ- శ్చర్యపరచడమే కాకుండా ఆంధ్రప్రభుత్వం మీద కోపం కూడా వచ్చింది.

తెలుగు వారిలో ఒక్క ప్రముఖ వ్యక్తీ లేడా, ఇది సిగ్గుచేటు,
తెలుగు వారి ఆత్మగౌరవానికి తీరని అవమానం అంటూ ప్రజలూ, ప్రతిపక్షాలూ ప్రభుత్వం మీద విరుచుకుపడ్డారు. ప్రభుత్వం రాష్ట్ర సంస్కృతిక విభాగాన్ని ప్రశ్నించి, వారు ఎందుకు పాల్గొనలేదో ఓ కమిటీ వేసారు.
కమిటీ రిపోర్ట్ చూసాక ముఖ్యమంత్రి గారు ఓ ప్రకటన ఇచ్చారు. అది... "కేంద్ర ప్రభుత్వం చేపట్టిన **మీరు - మీ సంస్కృతి** కి ఒక్క తెలుగు వారు పాల్గొనలేదని, తెలుగువారి ఆత్మగౌరవానికి దెబ్బ తగిలితే క్షమించాలి. మన రాష్ట్రం తరఫున ఒక్క ఎంట్రీ లేదన్నది వాస్తవమే...కానీ తెలుగు వారు అంతగా చింతించనవసరం లేదు. ఎందుకంటే ఠాగోర్, సుబ్రహ్మణ్య భారతీ, శివాజీ వేషధారణ చేసి బహుమతులు గెల్చుకొన్న వ్యక్తులు తెలుగు వారేనని గర్వంగా చెబుతున్నాను...."

**నవ్వు**  **నవ్వు**

ప్రేమ : ఆర్ట్ ఆఫ్ లవింగ్
పెళ్ళి : పార్ట్ ఆఫ్ లివింగ్
**విడాకులు:** అపార్ట్ ఇన్ లివింగ్ అండ్ లవింగ్

## ముందు  వెనుక

జాన్ హెన్రి అనే ఆయన మొట్ట మొదటి నోబుల్ శాంతి గ్రహీత. అప్పటివరకూ - ఆయన పేరు ఎవరికీ అంతగా తెలీదు. ఎవరికీ తెలియని ఊరూ పేరు లేని వారికి నోబుల్ ప్రైజ్ ఇచ్చారని అందరూ ఆశ్చర్యపోయారు. ఆరాతీస్తే జీన్ హెన్రి ఎవరోకాదు, ప్రపంచ ప్రఖ్యాతి చెందిన రెడ్ క్రాస్ సంస్థ సంస్థాపకుడు.

ఆయన్ని ఓ ఇంటర్వ్యూలో ప్రశ్నించారు..

"అందరికీ రెడ్ క్రాస్ గురించి తెలుసుకానీ, మీ గురించి అంతగా తెలియదు.."

"అవును తెలియకపోవడమే మంచిది. ఎందుకంటే ఏ వ్యక్తీ సంస్థ కంటే ఎక్కువ ప్రచారం పొందితే సంస్థ ఉద్దేశ్యం పతనావస్థకి చేరుకున్నట్లే.. సంస్థ ముందుండాలి..వ్యకులు వెనక ఉండాలి. అలా ఉంటేనే సంస్థలు పదికాలాల పాటూ నిలబడతాయి. ఈ నోబుల్ శాంతి బహుమతి నాదికాదు. ఈ సంస్థది.. " అని అన్నాడు జాన్ హెన్రి. అందుకే రెడ్ క్రాస్ లాంటి సంస్థలు పదికాలాల పాటూ నిలుస్తాయి.

## విచిత్ర  ప్రకటనలు

మీరు నిరక్షరాస్యులా?

తెలుగు చదవడం, వ్రాయడం రాదా?

అయితే ఈ క్రింది చిరునామాని సంప్రదించండి.

## ఆఖరి  కోరిక

సుబ్బారావుకి రోడ్డు ప్రమాదం జరిగి చావు బ్రతుకుల మధ్య కొట్టుకుంటున్నాడు. డాక్టరు ఇహ లాభంలేదని మహా బ్రతికితే ఇంకో వారం అని చెప్పాడు. సుబ్బారావు కి ఓ రోజు స్పృహ వచ్చింది. పక్కనే ఉన్న భార్యతో - "సుశీ! నే మరణించాకా నువ్వు పక్కవీధిలో అప్పారావుని పెళ్ళి చేసుకోవాలి."

"అవేం మాటలండీ! మీరు లేని జీవితాన్ని ఊహించుకోలేను...మీ స్థానంలో ఇంకో మగాణ్ణి, అందునా అప్పారావు లాంటి వ్యక్తిని ఊహించుకోలేను..." వెక్కి వెక్కి ఏడ్చింది సుశీల.

"అలాకాదు..సుశీ...ఇది నా ఆఖరి కోరిక - నువ్వు అప్పారావునే పెళ్ళి చేసుకుంటానని మాటివ్వాలి." ప్రాధేయ పడ్డాడు

"పెళ్ళి చేసుకుంటాను సరే... అప్పారావుని మాత్రం కాదు...అయినా అప్పారావునే ఎందుకు చేసుకోవాలి?"

"ఎందుకంటే - అప్పారావు మన ఇల్లు అమ్మకంలో నన్ను మోసం చేసాడు.."

ఆఖరిసారిగా ఠక్కున జవాబిచ్చాడు సుబ్బారావు.

## అలవాటు

జయ: మా ఆయన గోళ్ళు కొరికే అలవాటు మానిపించలేక చస్తున్నాను.

విజయ: మావారికీ ఆ పాడు అలవాటుంది. పెళ్ళయ్యాక ఒక్క రోజులో మానిపించేసా?

జయ: అదెలా సాధ్యం?

విజయ: ఏముంది, ముందు పళ్ళు నాలుగూ ఊడ గొట్టా!

# ఉచితం



సినిమా సంగీత ప్రపంచంలో సాలూరి రాజేశ్వర రావుగారిది ప్రత్యేక స్థానం ! ఆయన ఏ పాటకైనా బాణీలు కట్టడంలో చాలా శ్రద్ధ తీసుకునేవారు. ఓ సారి వాహినీ స్టూడియోలో ఓ సినిమా పాటకి బాణీలు కడుతున్నారు. దర్శకుడుకి సాలూరి వారి బాణీలు నచ్చడంలేదు. చివరికి ఎలాగో నచ్చి ఓ బాణీ సరేనన్నారు. ఇంతలో సదరు నిర్మాత గారు వచ్చి ఇంతకు ముందు ఖాయం చేసిన బాణీ బాగోలేదని ఇంకోటి చూడమన్నారు. సరే సాలూరి వారు ఇంకో బాణీ కట్టారు. నిర్మాత గారికి నచ్చింది. ఇంతలో ఓ మహానటుడు వచ్చాడు. ఇంతకుముందు కట్టిన బాణీలు అన్నీ చెత్తగా ఉన్నాయి. ఇంకోటి కట్టమన్నారు. ఈ స్వరం బాగోలేదు, పల్లవి ఇలా పెట్టండి.. చరణం ఇలా ఉండాలి అంటూ ఎవరికితోచినట్లు వారు ఉచిత సలహాలు పారేస్తున్నారు.

అప్పటికే మధ్యాన్నం నాలుగు దాటింది. ఉదయం ఎనిమిదింటికి మొదలెట్టిన రికార్డింగ్ సాయంత్రం నాలుగైనా కాలేదు. రాజేశ్వర రావుగారికి అసహనం పెరిగిపోయింది. ఇంతలో ఓ టీ అబ్బాయి టీ పట్టుకొచ్చాడు. రాజేశ్వరరావుగారు మహా మంట మీదన్నాడు. టీ అబ్బాయిని పిలిచి - "ఒరే నీక్కూడా ఏవైనా సలహాలు ఉంటే చెప్పు.. నాలుగవుతోంది. త్వరగా ట్యూన్ కట్టి ఇంటికెళ్ళాలి" ఇది విన్నాక నిర్మాత, దర్శకుడు, మహానటుడు నోరెత్తితే ఒట్టు.

# అచ్చ  టెల్గు షినేమా

చిత్రం: రాస్కెల్ ( టాగ్ లైను : ప్రేమకు కొలతలు లేవు )

దర్శకుడు: మణివణ్ణన్

హీరో: మెగా పవర్ స్టార్

హీరోయిన్: ఉషా కొఠారి

విలన్ : షాయాజీ షిండే

సంగీతం: రెహమాన్

కథ: రాఘవన్

గాయనీ గాయకులు: ఉదిత్ నారాయణ్ - శ్రేయఘోషల్ - సోనూ నిగం

మాటలు - పాటలు: డబ్బింగ్ బాస్

స్టంట్స్: అంజుమణి

నృత్యాలు: ప్లారెన్స్ డిసౌజా
ఫరా ఖాన్ ( లవ్ కిక్ సైడ్ కిక్ - సాంగ్)

స్పెషల్ ఎఫెక్ట్స్: సెల్వం

నిర్మాతలు: ఎం ఎన్ రాజు - వీరా రెడ్డి.

**ఈ నెలకి ఇహ ఈ డోసు చాలు**




వచ్చే నెల చూసుకుందాం

# ఆనందో బ్రహ్మ



- సాయి బ్రహ్మానందం గొర్తి

## నెలనెలా నవ్వుల విందు

### తేడా ...

దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం మాట.

ఈ మధ్యనే కాలం చేసిన ప్రముఖ హాస్య రచయిత డి వి నరసరాజు గారు భీమవరంలో ఓ సభలో ప్రసంగిస్తుండగా, పూర్వపు సినిమాలకీ, నేటి సినిమాలకీ తేడా చెప్పమని అడిగారు. "పూర్వం సినిమాలలో ఏదైనా విషయాన్ని వివరించాలంటే దర్శకుడు చాలా కష్టపడేవారు.ఇప్పటి దర్శకులకి ఆలోచించడం అనే కష్టం లేదు. కష్టమంతా చూసే వాళ్ళకే ! ఉదాహరణకి పెళ్ళి అయినతరువాత హీరోయిన్ గర్భవతి అని చూపించాలంటే, రాత్రి దీపం ఆర్పి తెల్లారేకా ఆమె వాంతి చేసుకునేట్లా చూపిస్తే అందరికీ సులభంగా అర్థం అవుతుందనుకొనేలా తీసేవారు. ఇప్పటి దర్శకులకి అంత కష్టం ఏమీ లేదు. - ఆలోచించాల్సిన అవసరం అంతకంటే లేదు ఎందుకంటే దీపం ఆర్పడాలు, వాంతుల అవసరంలేకుండా తొలిరాత్రి చీకటి సీనులే ఓపెన్‌గా వెలుగులో చూపిస్తున్నారు. ఇంతకంటే పెద్ద తేడా ఏమీ లేదు " అని తనదైన శైలిలో చెప్పారు. ఇప్పటి సినిమాలు చూస్తే నరసరాజు గారి మాటల్లో నిజం అందరికీ తెలుసు.

# విజిటింగ్  కార్డ్

ఓ తెలుగుభాషంటే అభిమానం ఉన్న ఓ వీరాభిమాని విజిటింగ్ కార్డ్ తెలుగులో అచ్చు వేయించుకోవడానికి వెళ్ళాడు. కార్డ్ అంతా తెలుగులోనే ఉండాలని - ఆయనకి రెండు ఫోన్ లున్నాయని మొదట సెల్లు నంబరు వేసి, దానిక్రింద ఇంటి నంబరు వేయమని ముద్రణాధికారికి చెప్పి మరీ వెళ్ళాడు. ఆ వీరాభిమాని తెలుగుభాషాభిమానం చూసి ముద్రణాధికారి ముచ్చటపడి , కాస్త ఉత్సాహంగా ఈ క్రింది విధంగా కార్డు వేసాడు.

వేటూరి వేంకటేశం

తెలుగు అధ్యాపకులు

**మొదటి సెల్లు:** ౨౩౨౫౨౫౬౬ **రెండో ఇల్లు:** ౨౫౩౨౨౭౦౬

# విచిత్ర ప్రకటనలు

బట్టలుతకమని మీ భార్యని చంపకండి.
LG వారి సహాయం తీసుకోండి.

మీ దంతాలు మీ చేత్తో పీక్కోకండి.
క్లోజ్‌డవున్ టూత్ పేస్టు వాడండి.

## తాపీ  వైద్యం

పంటినెప్పి బాధతో ఉన్న ఓ పిసినారి పేషంటు ఊళ్ళో ఉన్న ఫేమస్ దంత వైద్యుణ్ణి సంప్రదించాడు.

**పేషంటు:** భరించలేని పంటి నొప్పిగా ఉంది.

**దంత వైద్యుడు:** నో ప్రోబ్లం ! రెండు నిమిషాల్లో పన్ను పీకేస్తాను.

**పేషంటు:** పన్ను పీకడానికి ఎంతవుద్ది?

**దంత వైద్యుడు:** ఒకపన్నుకైతే మూడు వేలు, రెండు పళ్ళయితే అయుదువేలు

**పేషంటు:** ఏమిటి? రెండు నిమిషాల పనికి మూడు వేలా?

**దంత వైద్యుడు:** మీకు కావాలంటే తాపీగా ఓ రెండు గంటలసేపు పన్ను పీక గలను.

## ఏది  కష్టం?

ఓ క్లాసులో టీచర్ పాఠం చెబుతోంది. ఓ తుంటరి విద్యార్థి పాఠం వినకుండా అటూ ఇటూ
దిక్కులు చూస్తున్నాడు. టీచర్‌కి సహనం నశించింది.

**టీచర్:** నీకస్సల శ్రద్ధ లేదు. నీ చెవులకి వినికిడి కష్టంగా ఉందా?

**విద్యార్థి:** లేదు టీచర్ ! వినికిడి కష్టం కాదు...వినడమే కష్టంగా ఉంది.

## ఏది  ఇష్టం?

పెళ్ళాం: మీకు నాలో ఏది నచ్చుతుంది? నా అందమైన ఫేసా? నా తెలివితేటలా?

మొగుడు: రెండూ కాదు...నీ లోని సెన్స్ ఆఫ్ హ్యూమర్

## అర్ధాలే  వేరులే

ఆడవారి మాటలకీ అర్ధాలే వేరులే అన్నాడు ఓ మహాకవి..

పెళ్ళి అయ్యాక అనుభవంలో ఆ అర్ధాలు స్పష్టంగా తెలుస్తాయి.

మచ్చుక్కి కొన్ని..

భార్య: అవును

అసలు అర్ధం: కాదు

.భార్య: కాదు

అసలు అర్ధం: ( ఖచ్చితంగా ) కాదు

భార్య: మీ ఇష్టం

అసలు అర్ధం: నాకిష్టంలేదు.. అర్ధంకావడంలే!

భార్య: మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి

అసలు అర్థం: **వద్దు.** తేడా వస్తే ..తెలుసుగా

భార్య: పండక్కి పిల్లలకి బట్టలు కొనాలి

అసలు అర్థం: అదే చేత్తో నాకో పట్టు చీర, జత రవ్వల గాజులు

భార్య: నే చేసిన కొత్త వంటలు బాగున్నాయా?

అసలు అర్థం: బాగోలేకపోతే అలవాటు చేసుకు చావండి.

భార్య: నేనేమీ అరవడంలేదు.

అసలు అర్థం: అరుస్తున్నా అర్థంకావడంలేదా?

భార్య: పిల్లాడు లేచినట్లున్నాడు.

అసలు అర్థం: లేచి వెళ్ళి వాడి డయాపర్ మార్చి రండి.

భార్య: నేను లావెక్కానా?

అసలు అర్థం: నేను అందగా ఉన్నానని చెప్పండి. లేకపోతే...

భార్య: మీకు నేనంటే నిజంగా ప్రేమా?

అసలు అర్థం: బిల్లు భారీగా మీకు చెప్పకుండా షాపింగ్ చేసా. !

భార్య: చెప్పేది కాస్త వింటారా?

అసలు అర్థం: మీ పని అయినట్లే...

భార్య: ఇప్పుడే క్షణంలో రెడీ అయ్యి వస్తా!

అసలు అర్థం: హేపీగా పాత సంపూర్ణ రామాయణం సినిమా ఆన్ చేసుకోండి.

భార్య: మీరీ మధ్య నన్ను ఎంతగానో అర్థం చేసుకుంటున్నారు.

అసలు అర్థం: చెప్పి నట్లు చేసి తగలడండి.

భార్య: మీ అమ్మగార్ని ఈ శనివారం తీసుకురండి. ఓ రెండు రోజులుంటారు.

అసలు అర్థం: వచ్చేనెల మా అమ్మా నాన్న వచ్చి రెండు నెలలు ఉంటారు.

భార్య: నాకు వంట్లో బాగోలేదు. మీ మేనల్లుడి పెళ్ళికి మీరెళ్ళిరండి.

అసలు అర్థం: అంతబాగానే ఉంది. నాకే రావడం ఇష్టం లేదు.. అర్థంకావడంలా?

భార్య: పక్కింటి వాళ్ళు సినిమాకి వెళ్ళారట

అసలు అర్థం: సినిమాకి వెళదాం... ఓ ముద్దు ముచ్చట అస్సలు లేవు.

ఇదే జోకు కంటిన్యూ చేద్దాం




వచ్చే నెల తప్పకుండా రండి.

# ఆనందో



# బ్రహ్మ

- సాయి బ్రహ్మానందం గొర్తి

## సరిలేరు మనకెవ్వరూ ...

ఓ సారి ఓ తెలుగు వ్యక్తికీ, కన్నడిగునికీ, తమిళ తంబికీ వారిలో ఎవరు గొప్ప అన్న సంశయం వచ్చింది. ఎవరికివారు మేం గొప్ప అంటే మేం గొప్ప అని అరుచుకున్నారు. అలాక్కాదు, మనం ముగ్గురూ ఓ పోటీ పెట్టుకొని అందులో ఎవరు నెగ్గితే వారు గొప్ప అని తేల్చేసుకుందాం, అని ఒక అంగీకారాని కొచ్చారు. దగ్గరలో ఉన్న ఒక కోతిని ఏదైనా ఒక జోకు చెప్పి నవ్వించాలి, వెంటనే ఇంకో విషయం చెప్పి ఏడిపించాలి, ఆఖరుగా ఒక విషయం చెప్పి అక్కడనుండి ఆ కోతి పరిగెత్తి పారిపోయేలా చేయాలి. అందరూ పందేనికి సరే నన్నారు. మొదట కన్నడిగుడు ఆ కోతి చెవిలో ఓ జోకు చెప్పాడు. కోతి నవ్వలేదు తమిళ తంబి కూడా చెవిలో జోకు చెప్పినా నవ్వలేదు. తెలుగువాడి వంతు వచ్చింది. కోతి చెవిలో ఒకటే మాట అన్నాడు. అంతే కోతి పగలబడి నవ్వడం మొదలు బెట్టింది. మొదటి పందెం సరే, రెండోది. కన్నడిగుడు కోతి చెవిలో ఓ సీరియస్ కథ

చెప్పాడు. కోతి ఉలుకూ పలుకూ లేదు. తమిళ తంబి ప్రయత్నం కూడా వృధా అయ్యింది. తెలుగువాడు వెళ్ళి ఆ కోతి చెవిలో ఒక వాక్యం చెప్పడమే తడవు కోతి గుర్రుగా కోపంతో చూసింది. ఇహ - ఆఖరి పందెం. ఈ ఆఖరి దాంట్లో కూడా కన్నడిగుడికీ, తమిళ తంబికి పరాజయం తప్పలేదు. తెలుగు వాడు వెళ్ళి ఒకటే చెప్పాడు. ఇంకా వాక్యం పూర్తి కాకుండానే అక్కడనుండి  కోతి పరుగు పరుగున వెళ్ళిపోయింది. నువ్వే గొప్ప, మేం ఈ పందెంలో ఓడిపోయామంటూ కన్నడిగుడు తమిళ తంబి ఒప్పుకున్నారు. కానీ వారికి తెలుగువాడు మూడు పందేలు ఎలా నెగ్గేడో తెలుసుకోవాలనిపించింది. చెప్పమని ప్రాధేయపడ్డారు. తెలుగువాడు చెప్పడం ప్రారంభించాడు.

"ఓ అదా! మొదటి పందెం కోతిని నవ్వించడం కదా? ఏముంది.? తెలుగువాళ్ళందరూ కలసిగట్టుగా ఉన్నారని చెవిలో చెప్పాను. అంతే ఆ కోతి పగలబడి నవ్వింది."

ఇహ రెండో పందెం - కోతికి కోపం రప్పించడం - పదేళ్ళ క్రిందట హైద్రాబాదులో గజం రూపాయికొన్న స్థలం ఇప్పుడు గజం ఇరవై లక్షలకి అమ్మి లాభం పొందానని చెప్పాను. అసూయతో గుర్రుగా చూసింది అని చెప్పాడు.

"ఈ రెండు సరే ఆ  కోతిని ఇక్కడ నుండి ఎలా పారిపోయేలా చేయ గలిగావు? అని  కన్నడిగుడు, తమిళ తంబి అడిగారు.

"ఓ అదా ! ఏముంది.  ఆ కోతిని హీరోగా బెట్టి తెలుగు సినిమా తెస్తాను అని చెప్పాను. వెంటనే  హీరోయిన్ కోసం ముంబయ్ పరిగెత్తింది" అని విజయగర్వంతో చెప్పాడు.

## డేటింగ్  డైటింగ్

**డేటింగ్** - ఒకే రోజులో తక్కువ ప్రేమ ఎక్కువ ఫలితం

**డైటింగ్** - చాలారోజులు ఎక్కువ శ్రమ అతి తక్కువ ఫలితం

రెండింట్లోనూ తప్పనిది పరి`శ్రమ`

## బహు  మతి

అప్పారావుకి వారిజకి పెళ్ళి అయ్యి పాతికేళ్ళయ్యింది. వెడ్డింగ్ యానివర్సిరీకి బహుమతి ఏం కావాలంటూ శ్రీమతిని అడిగాడు.

"వజ్రాల నెక్లసా?"

"నాకేం వద్దు? "

"పోనీ నీ పేర హైద్రాబాదులో ఎపార్ట్‌మెంటా? "

"అదీ వద్దు. "

"మరేం కావాలి? " గట్టిగా అడిగాడు అప్పారావు.

"నాకు మీనుండి విడాకులు కావాలి?"

ఖంగుతిన్నాడు అపారావు. ఒక్కసారి తేరుకొని..

"సారీ డియర్ ! అంత ఖర్చు నేను భరించలేను. ఇంకేదైనా కోరుకో !"

# అదీ  విషయం

ప్రముఖ కవి స్వర్గీయ విశ్వనాథ సత్యనారాయణ ఎవరినీ లెక్కజేసేవారు కాదు. ఏదైనా కుండ బద్దలు కొట్టినట్లు చెప్పేవారు. ఓ సారి ఒకాయన వచన కవిత్వం రాసాడు. పుస్తకం అచ్చు వేయించుంకుందామని అనుకున్నాడు. విశ్వనాథ వారు పీఠిక రాస్తే బాగుంటుంది, అదీకాక - ఆయన పీఠిక రాస్తే తన పుస్తకానికీ కాస్త గిరాకీ పెరుగుతుంది కదా అని ఆలోచించి విశ్వనాథ వారిని సంప్రదించాడు. విశ్వనాథ వారు సరే మీ కవిత్వం ఇవ్వండి చదివి ముందుమాట రాస్తానన్నారు. వారం తరువాత - విశ్వనాథవారు ముందుమాట రాసిచ్చారు. అందులో కవిగారి కవిత్వం గురించి ఒక్క వాక్యం లేదు. ఏ కవిత గురించీ ప్రస్తావన లేదు సరికదా, రామాయణ మహాకావ్యం యొక్క విశిష్టత గురించి రెండు పేజీలు రాసిచ్చారు. కవిగారికి ఒళ్ళు మండిపోయింది. విశ్వనాథవారిమీద గయ్యిమని లేచాడు. మీ ముందుమాటలో నా కవిత్వం గురించి రాస్తారనుకుంటే రామాయణ విశిష్టత గురించి రాసేరేమిటి అని నిలదీసాడు. పాఠకులు ఈ పుస్తకం చదివితే మొత్తం పుస్తకంలో ఏదో ఒక విషయం ఉండాలి కదా? ముందు మాటలోనేనైనా కనీసం విషయం చేరిస్తే పుస్తకం అమ్ముడుపోతుంది కదా అని అలా రాసాను అని సమాధానం చెప్పారు. విశ్వనాథ వారి చురక కవిగారికి బాగానే అంటి మెల్లగా అక్కడనుండి జారుకున్నారు.

# అర్థాలే  వేరులే

క్రితం నెల ఆడవారి మాటలకు అర్థాలు పీకానని నా పీకనొక్కేంత పనిజేసారు . వాళ్ళ కోపాన్ని ఉపశమింపజేయడానికి మగవారి మాటలకి అర్థాలు ( ఉన్నా) లేవని తప్పించుకున్నా... మగ మిత్రులకోసం ఈ ముక్తాయింపు.

.

**భర్త** : అవును

**అసలు అర్థం:** నిన్ను కాదనే ధైర్యం లేదు

**భర్త** : కాదు

**అసలు అర్థం:** నువ్వు కాదన్నాక నే అవునంటే బ్రతగ్గలనా?

**భర్త** : నీ ఇష్టం

**అసలు అర్థం:** నా ఇష్టం ఇంకోటి త్వరలో చెబుతా

**భర్త** : నీ ఇష్టమే నా ఇష్టం

**అసలు అర్థం:** నే కాదన్నా నువ్వు వినవన్న సంగతి తెలుసు

**భర్త** : ఈ సారి బోనస్ మరీ తగ్గించారు.

**అసలు అర్థం:** పండగకి పిల్లలకి బట్టలు కట్ ! నీకు చీర తప్పదన్న విషయం తెలుసు

**భర్త :** ఇవాళ ఆఫీసులో లంచ్ పార్టీ ఉంది.
**అసలు అర్థం:** రోజూ నీ వంట తినలేక చస్తున్నా!

**భర్త :** మెల్లిగానే చెబుతునాకదా?
**అసలు అర్థం:** అరిచినా నీ బు[రకెక్కదన్న విషయం నాకు తెలుసు

**భర్త :** పిల్లాడు లేచినట్లున్నాడు. నువ్వెందుకులే నేనున్నాగా!
**అసలు అర్థం:** రాణీవారు మంచం దిగరన్న విషయం తెలుసు !
ఎలాగూ నా నెత్తిమీదే పడుతుందని తెలుసు

**భర్త :** నిన్ను తప్ప ఎంకెవరిని [పేమిస్తాను చెప్పు?
**అసలు అర్థం:** తప్పనిసరై [పేమిస్తున్నాను. - అవకాశం వస్తే...

**భర్త :** నువ్వీ మధ్య ఎంతగానో నన్ను అర్థం చేసుకుంటున్నావు
**అసలు అర్థం:** నేను మందు ఎక్కువ కొట్టినా నోరెత్తడం లేదని
గుర్తించాను.

**భర్త :** మా అమ్మ ఈ శనివారం వస్తుంది. . ఓ రెండు రోజులుండి
వెళుతుంది. ఖర్చులు పెరిగాయన్న విషయం నాకు గుర్తుంది.
**అసలు అర్థం:** మీ అమ్మానాన్న నెలలు తిష్టవేసినా మనకసలు ఖర్చే
శూన్యం ! [పేమకి ఖర్చు రాయలేం కదా?

భర్త : ఇంటి చాకిరీ చేసి చేసి నీ ఆరోగ్యం పాడయిపోతోంది.

నాకు ఎలాగూ తప్పదు. మా మేనల్లుడి పెళ్ళికి ఉదయం వెళ్ళి రాత్రికొచ్చేస్తాలే!

అసలు అర్థం: నే రమ్మంటే యుద్ధం తప్పదని తెలుసు. నే వెళ్ళొస్తే మా వాళ్ళ ముందు కాస్త పరువైనా దక్కుతుంది.

భర్త : రామారావు వాళ్ళావిడ చాలా మంచి కుక్ ట! బాంక్ లో పనిజేసే ఆవిడకంత టైమెక్కడిదో?

అసలు అర్థం: ఉద్యోగం చెయ్యమని పోరకపోయినా నా మొహాన పచ్చడి మెతుకులేనా?

భర్త : నీ కోసం ప్రత్యేకంగా ఈ రవ్వల నెక్లెసు కొన్నాను.

అసలు అర్థం: స్టాకుల్లో మన పెట్టుబడి గంగార్పణం చేసాను.

ఆడవారి మాటలకు అర్థాలువేరులేకి వారిచ్చిన డోసుకు ఇంకా కోలుకోలేదు.



వచ్చేనెల రండి.

# ఆనందో  బ్రహ్మ

**- సాయి బ్రహ్మానందం గొర్తి**

## అవసరం లేదు...

ఒకసారి ఢిల్లీ నగరంలో సముద్ర జలప్రాణుల ప్రదర్శన జరుగుతోంది. అందులో రకరకాల జల ప్రాణులు, అరుదైన చేపల్ని రొయ్యల్నీ, తాబేళ్ళనీ దేశం నలుమూలల నుండి అనేకమంది ప్రదర్శనకి తెచ్చారు. ఒకాయన మాత్రం ఓ పది సీసాల్లో రకరకాల పీతల్ని ప్రదర్శించాడు. ఆ పీతలు ఎగిరిపోకుండా ప్రతీ సీసాకీ మూత పెట్టి ఉంచాడు. కానీ ఒక్కటి మాత్రం మూత లేకుండా ఉంది. ఇది చూసి ఒక సందర్శకుడు అయన్ని అడిగాడు. అదేమిటి అన్ని సీసాలకీ మూత పెట్టి ఈ సీసాకి మాత్రం మూత పెట్టలేదెందుకని అడిగాడు. దానికాయన సమాధానంగా - "ఈ మూత పెట్టిన సీసాలో పీతలు కొన్ని తమిళనాడు నుంచి, కొన్ని కేరళనుండి, ఇలా ప్రతీ రాష్ట్రం నుండి తెప్పించాం. ఈ పీతలు ఎగరి పోకుండా మూతలు పెట్టాం. ఆ మూతలేని సీసాలో పీతలు అంధ్రా నుండి వచ్చిన తెలుగు

పీతలు. వాటికి మూత అవసరం లేదు. ఎందుకంటే ఒకటి పైకెగిరితే రెండో పీత వెనక్కి లాగుతుంది." అని నవ్వుతూ చెప్పాడు.

## అప్పు  తచ్చులు

కొన్ని పత్రికల్లో అచ్చు తప్పులు చూస్తూ ఉంటాం. కొన్ని చూస్తే అసలు అర్థం పోయి మరీ విపరీత అర్థాలు కనిపిస్తాయి. కొన్ని హాస్యం పుట్టిస్తాయి. మచ్చుకకు కొన్ని.

".**రామారావు గారి చేతబడి ప్రారంభించ బడింది.** ". కానీ అసలు రాయ దల్చుకున్నది, ".**రామారావు గారి చేత బడి ప్రారంభించ బడింది**" అని. .
చేత కీ బడికీ మధ్య ఖాళీ కంపోజరుగారు తినేసారు..
అలాగే "**ఎయిడ్స్ సుబ్బారావు గారి అవేదన**" అని వచ్చింది.
కానీ అసలు వార్త - "**ఎయిడ్స్ పై సుబ్బారావు గారి అవేదన**" .
ఇది కూడా కంపోజర్ గారి చేతి చలవే!

## పెళ్ళాం  కావాలి !

ఒక అతి తెలివి గుడుగ్గాయి పెళ్ళి చేసుకుందామని పేపర్లో పెళ్ళి ప్రకటన ఇవ్వాలనుకున్నాడు. అందరూ వధువు కావాలి అంటూ ప్రకటనలు ఇవ్వడం చూసి విసిగి కాస్త వెరైటీ గా ఉంటుందని "**పెళ్ళాం కావాలి**" అని ప్రకటన ఇచ్చాడు. అంతే మర్నాడు వేలకొద్దీ ఉత్తరాలు వచ్చి పడ్డాయి. అన్నిటి సారాంశం ఒకటే "ఆలస్యం చేయకుండా వచ్చి మా ఆవిడని తీసుకెళ్ళవచ్చు!" అని.

## అదే  విషయం

హైద్రాబాదు నగరం నడిబొడ్డున పెద్ద ఏక్సిడెంట్ జరిగింది. ట్రాఫిక్ స్థంభించిపోయింది. అసలేంజరిగిందో, ఎంతమంది చనిపోయారో చూద్దామని చాలా మంది జనం మూగారు. ఈ వార్త అందరికంటే ముందుగా ప్రసారం చేయాలని ఓ టీవీ జర్నలిస్టు ఉత్సాహ పడ్డాడు. జనాన్ని తోసుకుంటూ వెళ్ళలేకపోయాడు. చివరికి ఓ అయిడియా వేసి " తప్పుకోండి తప్పుకోండి నేను చని పోయిన వాళ్ళ అబ్బాయినంటూ" దొంగ ఏడుపు నటించాడు. జనం మెల్లగా తప్పుకొని దారిచ్చారు. తీరా చూస్తే కారుకింది ఓ గాడిద చచ్చి పడి ఉంది.

## సం  గీతం

వనజకి సంగీతం పిచ్చి. ప్రతీరోజూ హార్మనీ పెట్టెముందు కూర్చొని సాధన చేసేది. ఓ రోజు హార్మనీ పెట్టెలు రిపేరు చేసే అతను వనజ గారింటి తలుపు కొట్టాడు, "మీ హార్మనీ పెట్టె బాగు చేయడానికి పిలిపించారు కదా! వచ్చాను!" అని.

"నేను హార్మనీ పెట్టె రిపేరుకని ఎవర్నీ పిలవలేదే, మా ఆయన కానీ పంపించారా? "

"పంపింది మీ ఆయన కాదు, మీ పక్కింటి వాళ్ళు!" ఠక్కున జవాబొచ్చింది.

## పెళ్ళంటే –

స్నేహితులతో రెస్టారెంట్ కి వెళ్ళి విందుచేయడంలాంటిది. మనకు కావల్సింది అర్డరు ఇచ్చినా పక్కవాడి ప్లేటు చూసాక అది అర్డరిస్తే బాగుండేది కదా అని అనిపిస్తుంది.

ఇచ్చి పుచ్చుకోవడం లాంటిది. భర్త ఇస్తాడు. భార్య పుచ్చుకుంటుంది.

## గడసరి  బుడుగు

ఓ బుడుగు వాళ్ళ అమ్మమ్మకి ఇలా ఉత్తరం రాసాడు. "అమ్మమ్మా! క్రితం నెల నీ పుట్టిన రోజుకి కనీసం గ్రీటింగ్స్ కూడా పంపలేకపోయినందుకు సారీ! నేను సిగ్గు పడేలా చేయాలంటే వచ్చే వారం నా పుట్టిన రోజుకీ నువ్వు నే చేసినట్లుగానే చెయ్యి! - ఇట్లు నీ మనవడు బుడుగు

## డోసు ఎక్కువయితే సైడ్ ఎఫెక్ట్స్ వొస్తాయి. కాబట్టి...



వచ్చేసెం రండి.

# ఆనందో  బ్రహ్మ

**– సాయి బ్రహ్మానందం గొర్తి**

## స్వర్గం – నరకం

ఒకాయన చనిపోయాక స్వర్గానికి వెళతాడు.

అక్కడ ఓ సంఘ సేవకుడు ఒక కురూపితో కనిపిస్తాడు. ఉండబట్టలేక ఆ వ్యక్తి అక్కడున్న భటుడ్ని అడుగుతాడు. “ఓ అదా, ఆ సంఘసేవకుడు తన పెళ్ళాంని కొట్టేవాడు. అందుకే శిక్షగా కురూపితో కలసి ఉండాల్సి వస్తోందని..“ చెబుతాడు భటుడు.

కొంచెం ముదుకెళ్ళాక ఆ వ్యక్తికి ప్రజలని దోచుకున్న ఓ రాజకీయ నాయకుడు అందమైన అమ్మాయిలతో కనిపిస్తాడు. అశ్చర్యంగా “ఇదేమిటి? నాకు తెలిసి ఈ రాజకీయనాయకుడు పరమ దుర్మార్గుడు. ప్రజల సొమ్ము కాజేసాడు. ఇతనికీ ఈ సుఖాలా? “అని మరలా ప్రశ్నించాడు. మెల్లగా చెప్పాడు భటుడు.

“ఏమీ లేదు ఆ అందమైన అమ్మాయి తన జీవితంలో అనేక పాపాలు చేసింది. ఆమెకిదే పెద్ద శిక్ష..“

## డిప్రెషన్...



**రాజారావు:** ఏమిటి అలా దిగాలుగా ఉన్నారు? ఏమైనా సమస్య వచ్చిందా?

**గోపాలం:** ఏమీలేదు సమస్యంతా మా అవిడతోనే..

**రాజారావు:** ఏమయ్యిందేమిటి?

**గోపాలం:** ఏమీలేదు ఓ నలభై రోజులు మా అవిడ నాతో మాట్లాడనని శపథం చేసింది.

**రాజారావు:** అలాగా ! హాయిగా పండగ చేసుకోక మరి ఈ డిప్రెషన్ మొహం ఏమిటి?

**గోపాలం:** డిప్రెషన్ కాక, ఈ రోజే అఖరి రోజు...

## తప్పి పోయిన  పెళ్ళాం

ఎగ్జిబిషన్ లో ఓ అందమైన అమ్మాయి దగ్గరకెళ్ళి వినయ్ వెళ్ళి, "నాతో ఓ పదినిమిషాలు మాట్లాడగలరా? " అంటూ అడిగాడు.

" ఎందుకు? " ప్రశ్నించిందా అందమైన అమ్మాయి.

" ఏమీలేదు మా ఆవిడ తప్పి పోయింది. నేను ఎక్కడ ఏ అమ్మాయితో మాట్లాడినా ఠక్కున ప్రత్యక్షం అవుతుంది, అందుకని.. "

## అదీ  విషయం

ఓ రోగి ఆసుపత్రిలో జాయిన్ అవుదామని వెళుతున్నాడు. ఆసుపత్రి బయట తెల్లకోటు, మెడలో స్టెతస్కోపులతో ఓ ఇద్దరు డాక్టర్లు అక్కడ ఏదో వెతుకుతూ కనిపించారు.

“ఏమైనా పోగొట్టుకున్నారా? “ రోగి అ డాక్టర్లని ప్రశ్నించాడు.

“ ఇప్పుడే ఓ రాజకీయ నాయఖుడికి హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ చేస్తున్నాం. ఇక్కడెక్కడైనా ఓ పెద్ద రాయి దొరుకుతుందేమోనని.. చూస్తున్నాం“

## శలవు 

రాంబాబు తన మేనేజరు దగ్గరకెళ్ళి “ బాస్ రేపు మా ఇంట్లో సున్నం కొట్టించాలి. చాల పని ఉందని మా ఆవిడ శలవు పెట్టమంది..కాబట్టి రేపు శలవు కావాలి. “

“ నో ! శలవు ఇవ్వడం అస్సలు కుదరదు“ మేనేజరు

“థాంక్స్ బాస్! ఆనమ్మకంతోనె నేనూ ఉన్నాను.“ రాంబాబు ఊపిరి పీల్చుకున్నాడు.

## వేడా?

డాక్టర్: ఈ పేషంటు టెంపరేచరు తీసారా?

నర్సు: తీయలేదు., ఏం కనిపించడం లేదా?

## అంజనం

.సుందరి భర్త రెండేళ్ళ క్రితం పోయాడు. సుందరి తన భర్త తిథి రోజున ఓ అంజనం వేసే ఒకాయన్ని పిలిపించింది. అంజనం వేసే అతను సుందరి భర్త, సుబ్బారావు మాట వినిపిస్తానని చెప్పి.. సుబ్బారావుతో మాట్లాడ వచ్చని .సుందరికి చెబుతాడు. అన్న ప్రకారం సుబ్బారావు కనిపించడు కానీ మాట మాత్రం వినిపిస్తుంది.

" ఏమండీ ఎలా ఉన్నారండీ.. మీరు లేని లోటు అనుక్షణం కనిపిస్తోంది.. మీ కిష్టమని ఈ రోజు గుత్తి వంకాయ కూర వండాను. పెసరట్టు వేసాను.. వేళకి తిండి తింటున్నారా?

" నువ్వేం దిగులు పడకు సుందరీ ఈ జన్మ హాయిగా ఉంది. ఉద్యోగం చెయ్యాలన్న బాధ లేదు. ఏ మాత్రం కష్ట పడకుండా కావలిసినంత తిండి తింటున్నాను. చీకూ చింతలు అస్సలు లేవు.. రోజూ లేవడం, తినడం పడుకోవడం..ఎంతో హాయిగా ఉందంటే నమ్ము.."

" ఇంతకీ మీరు ఇక్కడున్నారిప్పుడు..? "

" ఓ అదా... మన ఇంటి ముందు పొలం దగ్గర ఉన్నాను."

" అదేమిటి పొలం దగ్గర ఉన్నారా...నాకేమీ కనిపించలేదే ఎప్పుడూ.."

" మన పొలం దగ్గరున్న గేదె నేనే... "

సుబ్బారావు ఇది చెప్పి అంతర్ధానమయ్యాడు.

డోసు మార్చాను ..  ఈసారి తగ్గాలని దేవుణ్ణి ప్రార్థిస్తా

# ఆనందో  బ్రహ్మ

- సాయి బ్రహ్మానందం గొర్తి

## సింహ స్వప్నం

ఓసారి ఒక పోలీసు పెద్దాయనకి రాష్ట్ర పతి అవార్డు వచ్చింది. ఊరంతా ముచ్చటపడి పోలీసు పెద్దాయనకి సన్మాన సభ ఏర్పాటు చేసారు. ఆ సభకి హోం మంత్రి గారిని అధ్యక్షులుగా ఆహ్వానించారు. హోం మంత్రి గారికి ఒకటా రెండా సవాలక్ష వ్యవహారాలుంటాయి.. సాయంత్రం అరింటికి మొదలు కావల్సిన సభ ఏడైనా మొదలు కాలేదు. ప్రజలకి సహనం చచ్చింది. నిర్వాహకులకి చెమటలు పట్టాయి. సరే మంత్రి గారు రావడానికి అలస్యం అవుతుంది, ఈ లోగా పోలీసు పెద్దాయన్ని మాట్లాడమని అడిగారు. పోలీసు పెద్దాయన ఇచ్చిన అవకాశం వేస్టు చేసుకోకుండా మొదలుపెట్టాడు. “రాష్ట్రపతి పతకం నాది కాదు. మీది. ఎందుకంటే పోలీసు శాఖలో విజయవాడ రౌడీపేట స్టేషన్‌లో నా మొదటి ఉద్యోగం. రౌడీలని చూసి మొదట్లో హడలి చచ్చేవాడ్ని. ఒకసారి ఒక గూండా ఒక స్త్రీని నడిరోడ్డు మీద వివస్త్రని చేస్తుంటే జనం అందరూ సినిమా చూస్తున్నట్లు చూస్తున్నారు. ఆ గూండా రౌడీని ఎదిరించే ధైర్యం ఎవరికీ లేకపోతే, నాలో ఏదో శక్తి ఆవహించి ఆ గుండాని అందరూ

ఆశ్చర్య పడేలా చితక బాదాను. ఆ లుచ్చాని కటకటాల వెనక వేసాను. - ఆ తరువాత నుండీ నేను రౌడీల పాలిట సింహ స్వప్నం అవడం మీకందరికీ తెలిసిందే.“ అంటూ యథాశక్తి సొంత డబ్బా మ్రోగిస్తుండగా హోం మినిష్టరు గారు యథాప్రకారం ఠంచనుగా రెండు గంటలు ఆలస్యంగా వచ్చారు. మినిష్టరు గారు పోలీసు పెద్దాయన్ని సత్కరించి నాలుగు మాటలు చెప్పడం మొదలు పెట్టాడు. “మహాజనులారా... ఈ పోలీసు పెద్దాయన మన తెలుగువాడు కావడం మనందరికీ గర్వకారణం. ఈ సన్మాన సభలో మీకు తెలియని విషయం ఒకటి చెప్పాలి.. మన పోలీసు పెద్దాయన చాలా మంచి వ్యక్తి ఇటువంటి మంచి వ్యక్తి చేతిలో మొట్టమొదటిగా అరెస్టు అయ్యిన వ్యక్తి నేనే నని సగర్వంగా చెప్పుకుంటున్నాను.....“

చిహ్న



“డాక్టర్! నాకు ఒళ్ళు పెరిగిపోతోంది. లావు తగ్గడానికి మందియ్యరా?“

“అయితే - ఉడిపి రెస్టారెంట్ కెళ్ళి మూడు పూటల తిను.. ఒళ్ళు అదే తగ్గుతుంది. “

“అదేమిటి డాక్టర్ ! మూడు పూటలా తింటే ఒళ్ళు ఎలా తగ్గుతుంది.?“

“ఉడిపిలో ఓ సారి తింటే తర్వాత ఫుడ్ పాయిజినింగయ్యి..వారం రోజులు మంచం దిగవు... అప్పుడు వళ్ళు అదే తగ్గుతుంది...“

## సమీకరణం...



2 చూపులు = 1 చిరునవ్వు

4 చిరునవ్వులు = 1 కలయిక

8 కలయికలు = 16 కౌగిలింతలు

32 కౌగిలింతలు = 1 తొందరపాటు

1 తొందరపాటు = 1 పెళ్ళి

1 పెళ్ళి = 2141816321111 సమస్యలు

2 చూపులు = (2141816321111 సమస్యలు X 0 చిరునవ్వులు)

బ్రతుకు = శూన్యం

## తప్పి పోయిన



భర్త చిట్టిబ్బాయి ఇల్లు వదిలి వెళిపోతే, పక్కింటి పంకజంతో కలసి పోలీసు స్టేషన్‌కి వెళ్ళింది వనజ.. పోలీసు ఆఫీసర్ తప్పిపోయిన చిట్టిబ్బాయి వివరాలు అడిగాడు. “చిట్టిబ్బాయి అరడుగులు.ఎత్తు, నల్లటి నిగనిగ లాంటి జుట్టు, తెల్లని తెలుపు, కండలు తిరిగిన శరీరం, నెమ్మదస్తుడు, ప్రేమ మూర్తి...“ అంటూ వివరాలిచ్చింది వనజ.

“ అదేమిటి.. మీ ఆయన అయిదడుగుల నల్ల తుమ్మ మొద్దులా బక్కగా ఉంటాడు, ..నిన్నూ నీ పిల్లల్నీ రాచి రంపాన పెడతాడు కదా...మరి ఈ వివరాలూ ...“ అంటూ బిత్తరపోయింది పక్కింటి పంకజం.

“ఓ అదా... అసల వివరాలు ఇస్తే ఈ పోలీసులు ఎక్కడ వెతికి పట్టుకుంటారోనని...“ చల్లగా చెప్పింది వనజ.

# సినీ చిత్రాలు



హీరోయిన్ పెదాలకి ఒక్కసారి లిప్ స్టిక్ వేస్తే చాలు..గోదావరిలో మునిగినా పిసరంత కూడా రంగు పోదు.

హీరో హీరోయిన్ల తాలుకు బంధు వనితలు రాత్రి పట్టు చీరలు కట్టుకొని నలగకుండా మరీ పడుకుంటారు.

హైద్రాబాదులో ఏ ఇంటినుండి నైనా బిర్లా మందిర్ కనిపిస్తుంది.

పోలీసులు దొంగల్ని పట్టుకోవడానికి మొట్టమొదటి వెళ్ళేది నైట్ క్లబ్‌కే!

కార్లు, సుమోలూ  ఎప్పుడు ఎక్కడ గుద్దుకున్నా క్షణాల్లో మంటల్లో తగలబడి పోతాయి.

కరాటేలో బ్లాక్ బెల్టున్న విలన్ సహచరులు తమ ముందున్న సహచరులు చచ్చేలా తన్నులు తినేవరకూ ఎంతో సహనంతో కోతుల్లా గెంతుతూ, హీరో గారి చేత వరసలో వచ్చి మరీ దెబ్బలు తింటారు.

అరవైమందిని అవలీలగా చితకబాదే హీరో, ఒక్కసారి తగిలిన దెబ్బలకి హీరోయిన్ మందు రాస్తే టాపు ఎగిరేలా అరుస్తాడు.

బాంబు పేలితే హీరో గారి చొక్కా చిరుగుతుంది తప్ప, ఒక్క బొట్టయినా రక్తం రాదు.

## గర్ల్ ఫ్రెండ్ – పరీక్ష లాంటిది.



1. అంతుచిక్కని ప్రశ్నలు
2. వచ్చినా అర్థంకావు
3. చిన్న ప్రశ్నకి కూడా తాటికాయంత జవాబురాయాలి
4. ఎప్పుడూ ఒకే రిజల్ట్ - ఫెయిల్

## పెళ్ళాం – పుస్తకం లాంటిది



1. లెక్కకందని పాఠాలు
2. ఎంత అర్థం చేసుకుందా మనుకున్నా మింగుడు పడవు.
3. రోజంతా ఒళ్ళు హూనం అయ్యేలా చదవినా బుర్ర కెక్కేది శూన్యం
4. ఎప్పుడూ ఒకే రిజల్ట్ - శిరోభారం వెరశి తలనొప్పి



## మొగుడు – పెన్ను లాంటి వాడు.

1. ఎప్పుడు రాస్తుందో ఎప్పుడు రాయదో పైవాడికి కూడా తెలియదు.
2. ఎప్పుడు జేబులోంచి జారుకుంటుందో చెప్పలేం
3. సమయానికెప్పుడూ రాసి తగలడదు.
4. ఎప్పుడూ ఒకే రిజల్ట్ - ఉంచుకోలేం పారేయలేం

ఈసారి డోసు కాదు  దేముణ్ణి మార్చి చూస్తా...

# ఆనందో  బ్రహ్మ

నెలనెలా నవ్వుల విందు

- సాయి బ్రహ్మానందం గొర్తి

## మేధావి

ఓ సారి రోదశి యాత్ర ముగించుకొచ్చిన ఒక అమెరికన్ తన సాధించినదానికి గర్వపడుతూ పక్కనే ఉన్న ఒక రష్యన్ శాస్త్రవేత్త వైపు తెరిగి, “నీకో విషయం తెలుసా? మా అమెరికన్లను మించిన మేధావులు ఈ ప్రపంచంలోనే ఉండరు. ఏదైనా కనుక్కోవాలంటే మా తరువాతే !“ అని అన్నాడు గర్వంగా. “దానిదేముంది. ప్రపంచంలో మిగతా దేశాల్లో కూడా మేధావులు ఉన్నారు.“ అన్నాడు రష్యన్. అమెరికన్‌కి కోపం వచ్చినా తమాయించుకొని, “ నేను నీతో అంగీకరించను. ఉదాహరణకి, చంద్రుడి మీద గురుత్వాకర్షణ శక్తి ఉండదు. అక్కడ ఇంకు పైనుండి కిందకు ప్రవహించక పెన్ను రాయదని తెలుసు కదా! మా అమెరికన్లు కొన్ని వేల మిలియన్ల డాలర్లు ఖర్చుబెట్టి ఒక పెన్ను కనుక్కున్నారు. అ పెన్ను భూమీద

రాస్తుంది. చంద్రుడి మీద రాస్తుంది. ఇది నిజంగా ఒక విజ్ఞాన పరిశోధనా విజయం" అని అన్నాడు.. "ఓస్ అంతేనా, మేం మొదటి సారి చంద్రుడిపై అడుగుపెట్టినపుడు అయిదు పేజీల ఒక ఉత్తరం రాసారు మా వాళ్ళు " అని తేలిగ్గా తీసి పారేసాడు. "అదెలా సాధ్యం?" అశ్చర్యపోయాడు అమెరికన్ ." ఏముంది! పెన్నుకి బదులు మేం పెన్సిల్ వాడాం" ఠక్కున జవాబిచ్చాడు రష్యన్ !

## కొంత



సుబ్బారావుకి సూటు కుట్టించుకోవాలని మనసేసింది. రేమండ్స్ షాప్ కెళ్ళి గుడ్డ కొనుకొచ్చాడు. ఓ టైలర్ దగ్గరకెళ్ళి, సూటు కుట్టమని అడిగాడు. కొలతలు తీసుకున్న తరువాత , గుడ్డ చాలదని కుట్టడం కుదరదని చెప్పాడు టైలర్! సుబ్బారావు ఇంకో టైలర్ దగ్గరకి పట్టు కెళ్ళాడు. అతను కొలతలు తీసుకొని, సుబ్బారావుకి రెండురోజుల తర్వాత సూటు కుట్టి ఇచ్చాడు. అ మర్నాడు సుబ్బారావు సూటు ధరించి మొదటి టైలర్ దగ్గరకెళ్ళి, " నువ్వు గుడ్డ చాలదన్నావు చూసావా, పక్క వీధిలో టైలర్ ఎంత బాగా కుట్టాడో ! " అని గొప్పగా చెప్పాడు. " ఓ అదా! పక్క వీధిలో టైలర్‌కి ఒక్కడే అబ్బాయి, నాకు ఇద్దరు.. !" చల్లగా చెప్పాడు టైలర్.

# బోనస్...



ఇండియా బంగ్లాదేశ్ క్రికెట్ మాచ్ జరుగుతోంది. బంగ్లాదేశ్ వాళ్ళు అతి కష్టం మీద రెండు రన్ల తేడాతో నెగ్గారు. మొత్తం సీరీసు 5-౦ స్కోరుతో ఇండియాని ఇంటికి పంపారు.

ఇండియన్ క్రికెట్ బోర్డ్ ఇది చూసి మండిపడింది. అసలు మనవాళ్ళు ఇంత దారుణంగా ఫెయిల్ అవ్వడానికి కారణం కనుక్కోమని ఒక కమిటీ వేసారు. కమిటీ అన్ని మాచ్‌లూ మరో సారి టీవిలో రీప్లే చూసి, ప్రతీ మాచ్ లోనూ ఒక్కడే బాట్స్ మెన్ ఆడుతున్నాడు. మిగతా అందరూ విఫలం అవుతున్నారు అని తేల్చారు. అందరూ బాగా ఆడేలా ఎలా చెయ్యడం అని క్రికెట్ బోర్డ్ ఒక నిపుణుల కమిటీ వేసింది. కమిటీసలహా ప్రకారం టీంకి ఒక ఫీల్డింగ్ కోచ్ , ఒక బాటింగ్ కోచ్, ఒక బౌలింగ్ కోచ్ ఇలా ఒక్కో విభాగానికి ఒక కోచ్ పెట్టారు. అంతే కాకుండా బాగా అడితే ఒక్కో ప్లేయర్‌కి బోనస్ ప్రకటించారు. మరలా వచ్చే సీరీస్ లో కూడా ఇండియాని చావ బాదుడు బాదింది బంగ్లాదేశ్ !

ఈ సారి బౌలింగ్ కోచ్, బాటింగ్ కోచ్ , ఫీల్డింగ్ కోచ్ అందరూ ఒకరిది తప్పంటే ఇంకొకరిదని కొట్టుకొని, చివరకి కేప్టెన్ సరిగ్గా చేయలేదని, అతని వల్లే టీం ఓడిపోయిందని  అరోపించారు. ఇండియన్ క్రికెట్ బోర్డ్ కేప్టెన్ని తొలగించి ఓటమికి మూల కారణం కనుక్కొన్నందుకు ముగ్గురు కోచ్ లాకీ అదనపు బోనస్ లిచ్చి ఇంకో పదేళ్ళు కాంట్రాక్ట్ పెంచింది.

## స్పీడు



బంటి: మా నాన్న ఎంత ఫాస్ట్‌గా పరిగెడతాడో తెలుసా? చేతిలో పిస్టల్ పేలిస్తే గుండు కంటే ముందుగా టార్గెట్ చేరు కుంటాడు.

టింకు: ఓస్ అంతేనా మా నాన్న  చేతిలో పిస్టల్ పేలిస్తే రెప్ప పాటు లో టార్గెట్ చేరుకుంటాడు.

బంకు: మీ ఇద్దరికీ స్పీడు అంటే అస్సలు తెలీదు. మా నాన్న గవర్నమెంటు ఉద్యోగి. సాయంత్రం అయిదుకు పని ముగించి, మూడింటి కల్లా ఇంట్లో ఉంటాడు.

# పోలీసు చిత్రాలు



ఒకసారి పోలీసు డిపార్ట్‌మెంట్, సి ఐ డి వింగు, సి బి ఐ వాళ్ళు మేం గొప్పంటే మేం గొప్పని వాదించుకున్నారు. చివరకి ఇండియన్ జనరల్ అఫ్ పోలీసు అధికారి ముగ్గురికీ పరీక్ష పెట్టాడు. అడవిలోకి ఒక పిల్లి పిల్ల నొదిలి ఎవరు ముందు పట్టుకొస్తే వారు గొప్ప అని నిర్ణయిస్తాడు.

సీ బి ఐ వాళ్ళు అడవిలో రంగ ప్రవేశం చేసి, ముఖ్యమైన చోట్లలో ఒక కుక్కని పెడతారు. కనిపించిన ప్రతీ వాడినీ ఇంటరాగేట్ చేసి, అడవిలో ప్రతీ ఇంటినీ సొదా చేసి, చివరకి పిల్లులు అనేవి లేవు అంతరించి పోయాయని నిర్ధారిస్తారు.

సి ఐ డి వళ్ళూ అడవిలోకి వెళ్ళి వెతకడం ప్రారంభిస్తారు. రెండు వారాల పాటు రాత్రీ పగలూ కనిపించిన పుట్టా చెట్టూ గాలించి, ఒక్క క్లూ దొరక్క అడవికి నిప్పు పెట్టి అడవిని నాశనం చేస్తారు. పిల్లి ఎన్ కౌంటర్లో చచ్చిందని ప్రకటించి అడవి కాల్చడం వల్లే పిల్లిని చంప గలిగామని ప్రకటిస్తారు.

తమ వంతు వచ్చాక పోలీసు డిపార్ట్‌మెంట్ అడవిలో కి వెళ్ళి, ఓ పందిని పట్టుకొని చావ బాది రెండు గంటల తర్వాత బయటకొచ్చి పందిని కొడుతూ తీసుకొస్తారు ఆ పంది అరుస్తూ అంటుంది

" ఇహ కొట్టకండి, నేనే పిల్లిని ! నేనే పిల్లిని ! "



# ధైర్యం

ఓ సారి నేవీ చీఫ్ ఆర్మీ చీఫ్‌ని కలుస్తాడు. మిలటరీ కాంప్ అంతా పర్యవేక్షించాక "మీ నావికా సైనికులు ఎలా ఉన్నారు? " అని అడుగుతాడు

"మావాళ్ళా, చాలా ధైర్యవంతులు ! ఎంతటి కష్టమైన పనినైనా క్షణంలో చేసుకొస్తారు. " చెబుతాడు నేవీ చీఫ్.

"మా వాళ్ళు కూడా చాల ధైర్యవంతులు కావాలంటే చూద్దువుగాని రా !" అంటూ తీసుకెళతాడు.

అక్కడ ఉన్న ఒక సైనికుడ్ని పిలిచి - "దగ్గర్లో ఉన్న టాంకుని చేత్తో తోయమని చెబుతాడు. వెంటనే సైనికుడు అదిరిపడి " ఓరి వెధవా, నీకేమైనా పిచ్చి పట్టిందా? చేత్తో తోస్తే టాంకు కింద పడి చస్తాను రా! బుద్దున్న వెదవెవ్వడూ ఇలాంటి పని చేయడు. " అంటూ పారిపోతాడు. ఆర్మీ జనరల్, నేవీ జనరల్ వైపు తిరిగి " చూసావా ! మా వాళ్ళు ఎంత ధైర్యవంతులో ! ఆర్మీ జనరల్ ముందు ఇలా మాట్లాడానికి ఎంతో ధైర్యం కావాలి తెలుసా !" నవ్వుతూ చెప్పాడు.

నావల్ల కాదు  కాంపోడర్ నడిగి చూస్తా...

# ఆనందో



# బ్రహ్మ

నెలనెలా నవ్వుల విందు

**- సాయి బ్రహ్మానందం గొర్తి**

## అతి–తెలివి

సాధారణంగా మనం హొటల్స్‌లో "బయట తెచ్చుకున్న అహారం ఇక్కడ తినరాదు " అనే బోర్డులు చూస్తాం! ఓ సారి ఇద్దరు ప్రబుధ్ధులు హొటల్‌కి వెళ్ళి కాఫీ అర్డరిచ్చి, వాళ్ళు తెచ్చుకున్న ఫుడ్ తినడం మొదలు పెట్టారు. ఇది చూసిన సర్వరు - "మీరు తెచ్చుకున్న అహారం ఇక్కడ మీరు తినరాదు అని బోర్డు పెట్టం కదా, కనిపించడం లేదా?" అంటూ కసురు కున్నాడు. వేంటనే అ ఇద్దరు ప్రబుధ్ధులూ ఒకరి మొహాలు ఒకరు చూసుకొనీ,, అంతేనా అన్నట్లు పెదవి విరిచి, ఒకరి ఫుడ్ ఇంకొకరు మార్చుకొని తినడం మొదలు పెట్టారు. "చెప్పింది అర్థం కావడం లేదా?" అని సర్వరు అరిస్తే, "నేను తెచ్చుకున్న ఫుడ్ తినకూడదన్నావు కానీ, ఇంకోళ్ళు తెచ్చిన ఫుడ్ తినకూడదని రాయలేదు కదా, అందుకే నే తెచ్చినది అతనికి, అతను తెచ్చిన ఫుడ్ నేనూ తింటున్నాం !" అంటూ తాపీగా జవాబిచ్చారు. ఈ సమాధానం విని జుట్టు పీక్కున్నాడు సర్వరు.

## ప్రేమ



సుందరి సుబ్బారావు తాజ్ మహల్ చూడ్డానికి వెళ్ళారు.

"మీ కస్సలు పెళ్ళాం అంటే ప్రేమలేదు. ఈ షాజహాన్ని చూడండి పెళ్ళాం అంటే ఎంత ప్రేమో! పెళ్ళాం పోయిన తర్వాత, అమె పేర ఎంత అందమైన సమాధి కట్టించాడో! మీరూ ఉన్నారు, ఎందుకు?" అంటూ సుందరి సుబ్బారావుపై విరుచుకుపడింది

" నేను వారం క్రితమే హైద్రాబాదులో వంద గజాల స్థలం కొన్నాను. ఇహ నీదే అలస్యం! " సుబ్బారావు తడుముకోకుండా జవాబిచ్చాడు.

## స్పెషల్ చాయ్...



ఇద్దరు స్నేహితులు ఇరానీ హోటలుకెళ్ళారు.

వైటరు: మామూలు చాయా లేక స్పెషల్ చాయా?

మొదటి వ్యక్తి: నాకు స్పెషల్ చాయ్ కావాలి!

రెండో వ్యక్తి : నాకూ స్పెషల్ చాయే పట్టుకురా, కానీ కప్పు మాత్రం శుభ్రం గా కడిగి మరీ పట్టుకురా!"

కొంత సేపయ్యాక వైటరు చాయ్ పట్టుకొచ్చీ అమాయకంగా ఇలా అడిగాడు.

"ఇదిగో మీ రెండు చాయ్‌లూ! ఇంతకీ మీలో ఎవరు శుభ్రంగా కడిగిన కప్పులో చాయ్ ఆర్డరిచ్చారు ? "

## దొరకునా...



ఓ అతి తెలివైన జ్యోతిష్కుడు కింది విధంగా బోర్డు పెట్టాడు.

"మేము ప్రపంచంలో ద్వితీయ శ్రేణి సేవలు అందిస్తాము. ప్రథమ శ్రేణి సేవలు కావాలంటే ఈ క్రింది వారిని సంప్రదించండి!"

ఆ బోర్డు కింద "దేముడి" పటం ఉంది.

## యాక్సిడెంట్



వెంకటేశానికి రెండు చెవులకీ పెద్ద పెద్ద కట్లు వేసారు. పరామర్శకని వెళ్ళిన ఓ స్నేహితుడు "ఏమయ్యిందని? " అడిగాడు.

"ఏం లేదూ షర్ట్ ఇస్త్రీ చేస్తుండగా ఫోన్ వచ్చింది. కంగార్లో ఫోన్ అనుకొని చేతులో ఉన్న ఇస్త్రీ పెట్టె చెవి దగ్గర పెట్టాను. కాలింది."

"అయితే, మరి రెండో చెవి ?"

"అదా! ఒక చెవి కాలింది కదా, వెంటనే డాక్టర్‌కి ఫోన్ చేసా?"

కంగు తిన్నాడు పరామర్శ కొచ్చిన మిత్రుడు.

## జాలి



రాజేష్, సురేష్ మంచి మిత్రులు ! ఇద్దరూ ఒకేసారి పిచ్చాసుపత్రిలో వైద్యం తీసుకుంటున్నారు. వాళ్ళని చూడ్డానికని కొంతమంది మిత్రులు హాస్పటల్ కి వచ్చారు.

"పాపం! రాజేష్ ని చూస్తే జాలి వేస్తోంది. తను ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన ఐశ్వర్య ఇతన్ని కాదనివదిలి వెళితే తట్టుకోలేక భగ్న ప్రేమికుడిలా తయారయ్యి, చివరకి పిచ్చివాడుగా మారాడు!"

"మరి సురేష్ కేమయ్యింది?" ఇంకొకరు ప్రశ్నించారు.

"ఆ ఐశ్వర్య సురేష్ని పెళ్ళి చేసుకొంది, అంతే!"

## మార్నింగ్ వాక్



ఓ ఇద్దరు వ్యక్తులు మార్నింగ్ వాక్కి వెళదామని నిశ్చయించుకున్నారు. మొదటి వ్యక్తి రెండో వ్యక్తి ఇంటికి వచ్చాడు.

మొదటి వ్యక్తి : ఇవాళ భీకరమైన చలిగా ఉంది! స్వెటర్ తెచ్చుకో !

రెండవ వ్యక్తి : అలాగా ! ఇక్కడంత చలిగా లేదు అయినా బయట చలి ఎక్కువగా ఉందని నీకెలా తెలుసు.?

మొదటి వ్యక్తి : ఏమీ లేదు మన పక్కింటి లాయరు, జేబులో చేతులు పెట్టుకొని వెళ్ళడం ఇప్పుడే చూసాను.

రెండవ వ్యక్తి : ???

# ఫీలింగ్



రాజ్యానికి ఒంట్లో సుస్తీ చేసి, డాక్టర్ దగ్గరకెళ్ళింది. డాక్టర్ పరీక్షలన్నీ చేసి, "అమ్మా ! మీరు ఆరు నెలలు మించి బ్రతకరు!" అని చెప్పాడు.

"మరి అయితే నేనిప్పుడేం చేయాలి?" భయ పడుతూ అడిగింది రాజ్యం.

"ఏం కంగారు లేదు! ఓ మంచి ముహుర్తం చూసి ఓ జీవిత భీమా ఏజంటుని పెళ్ళి చేసుకో!"

"పెళ్ళి చేసుకుంటే ఎక్కువకాలం బ్రతుకుతానా?" అశగా అడిగింది రాజ్యం.

"అదేం లేదు! జీవిత భీమా ఏజంటుని పెళ్ళి చేసుకుంటే అర్నెల్ల టైము అరవై ఏళ్ళ ఫీలింగ్ ఇస్తుంది. అంతే ! " ఉచిత సలహా పారేసాడు డాక్టర్ !

పోనీ లాఫింగ్ గ్యాసు  ట్రై చేద్దామా?

# ఆనందో



# బ్రహ్మ

నెలనెలా నవ్వుల విందు

- సాయి బ్రహ్మానందం గొర్తి

## ఎంత దూరం?

ఓ అతి తెలివైన భక్తుడు దేముడి కోసం తప్పస్సు చేయడం మొదలు పెట్టాడు. అతని తప్పస్సుకి మెచ్చి, దేముడు ప్రత్యక్ష్మయ్యాడు. ఆనందంతో తబ్బిబ్బయ్యి, ఆ భక్తుడు "దేముడా! స్వర్గం ఇక్కడనుండి ఎంత దూరం?" అని అడిగాడు. "ఏముంది? కొన్ని వందల వేల కోట్ల యోజనాల దూరం ఉంది!" అన్నాడు దేముడు.

"అంత దూరం నుండి రావాలంటే ఎంత టైం పడుతుంది?"

"ఏముంది? క్షణంలో వచ్చాను..."

"క్షణంలో వచ్చావా? క్షణం అంటే?..." అమాయకంగా అడిగాడు భక్తుడు.

"మా లెక్కలో వందల వేల కోట్లు అంటే ఒకటితో సమానం!"

"అలాగా? అయితే నాకు అంతగా అశ లేదు. ఒక్క పైసా ఇయ్యి చాలు !" అతి తెలివి ప్రదర్శించాడు భక్తుడు.

"ఓస్, అంతేనా! ఒక్క క్షణంలో ఇస్తాను? అంటూ దేముడు మాయ మయ్యాడు.

## కష్టాలు



అప్పలరాజు ప్రతీ రోజు ఒకే హొటల్లో రోజూ తినడానికి వెళ్ళేవాడు. తింటున్నంత సేపూ, ఆ ఫుడ్ ఎంత చెత్తగా ఉందో ఏకరువు పెట్టేవాడు.

"రోజు రోజుకీ మరీ అధ్వాన్నంగా ఉంటోంది! ఉప్పుంటే, కారం ఉండదు, కారముంటే పులుపుండదు. ఈ హొటల్లో తినడం మంటే ఓ పెద్ద శిక్షే! ఛీ ! ఛీ! దరిద్రంగా ఉంది !!" అంటూ పదిమందికీ వినిపించేలా తిట్టేవాడు.

అప్పలరాజుని ఓ వ్యక్తి ప్రతీరోజూ గమనిస్తూనే ఉన్నాడు.

ఓ రోజు ఉండ బట్టలేక, "ఏం సార్! గత నెలరోజులుగా మిమ్మల్ని ఇదే హొటల్లో ప్రతీరోజూ చూస్తున్నాను. ఫుడ్ తింటున్నంత సేపూ తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతూ, తింటున్నారు. భలే విచిత్రంగా ఉంది. మీకు అంతగా నచ్చకపోతే, ఇంకో హొటల్ కెళ్ళి తినచ్చు కదా? " అని ప్రశ్నించాడు.

"ఏం చెయ్యమంటారు చెప్పండి? నా ఖర్మ. ఈ హొటల్లో తిండి తిని నెల్లాళ్ళల్లో పది కిలోలు వెయిట్ కోల్పోయాను... మీకు వేళాకోళంగా ఉందా?" చికాకు పడ్డాడు అప్పలరాజు.

"అయినా ఇక్కడే తింటున్నారా? చాలా ఫన్నీగా ఉంది.." అవతల వ్యక్తి నవ్వు ఆపుకోలేక పోయాడు.

"ఏం చెయ్యమంటారు? ఇప్పటికే ౧౦ కిలోలు బరువు తగ్గాను.. ఇంకో ౨౦ కిలోలు తగ్గాలి....నా కష్టాలు నావి..." అప్పల రాజు నెత్తి బాదుకున్నాడు.

## జుర్మానా...



ఓ జేబు దొంగని కోర్ట్‌లో విచారణకి హాజరు పరిచారు.

" ఈ జేబుదొంగ పాల్పడిన నేరాలు అన్నీ సాక్షాధారాలతో నిరూపణ అయ్యాయి. కాబట్టి ఇతనికి పాతిక వేలు జుర్మానా , పదేళ్ళ జైలు శిక్ష విధించడమయినది. ఒకవేళ జుర్మానా కట్టలేకపోతే, ఈ శిక్ష ఇంకో అయిదేళ్ళు పొడిగించ బడుతుంది..." జడ్జి గారు తీర్పిచ్చారు.

"సార్! నా దగ్గర అంత మొత్త ం లేదు.. జుర్మానా కట్టలేను. కానీ నన్నో పదినిమిషాలు ఈ జనం మధ్యకి వెళ్ళే అనుమతి ఇవ్వండి.. క్షణంలో మీ జుర్మానా చెల్లిస్తాను " అంటూ జేబుదొంగ అమాయకంగా అడిగాడు.

## ట్రీట్‌మెంట్ ...



"డాక్టర్ ! నాకు నిజంగా న్యూమోనియా వచ్చిందంటారా? మలేరియా వస్తే న్యూమోనియా ట్రీట్‌మెంట్ చేయడం వల్ల అనేక మంది చనిపోతున్నారని, ఆ మధ్య పేపర్లో చదివాను..- ఇది నిజమేనా ?" భయం భయంగా అడిగాడు ఓ పేషంట్.

"నువ్వేం కంగారు పడకు! నేను న్యూమోనికి ట్రీట్‌మెంట్ చేస్తే న్యూమోనియా వల్లే పోతారు. మలేరియా వల్ల పోయే ఛాన్సే లేదు !!" అభయ మిచ్చాడా డాక్టర్

## ప్లీజ్!



పాపారావు, పార్వతీ మొగుడూ పెళ్ళాలు. ఇద్దరికీ క్షణం పడేది కాదు. ప్రతీరోజూ గిల్లి కజ్జాలు పెట్టుకొనే వారు. చివరకి ఇద్దరూ విడాకులు తీసుకొని, వేరు వేరుగా అదే వీధిలో ఉంటున్నారు. ఓ రోజు కారులో పాపారావు వెళుతున్నాడు. అతని కెదురుగా పార్వతి కారులో ఎదురుపడింది. పాపారావుని చూసి రోడ్డు కడ్డంగా కారు ఆపి, తీరిగ్గా వార పత్రిక చదవడం మొదలు పెట్టింది. పాపారావుకి ఒళ్ళు మండిపోయింది. కానీ ముందుకెళ్ళ లేడు, వెనక్కెళ్ళ లేడు. అ వీధి ఇరుకు వీధి ! కోపంతో ఊగిపోయాడు... కానీ ఏమీ చేయలేడు.

"పార్వతీ! నేనూ కూడా సీరియల్ మిస్సయ్యాను. నువ్వు పుస్తకం చదవడం అయ్యాక నాకు ఓ సారి ఇవ్వవూ?" అంటూ నవ్వుతూ అడిగాడు.

## యమ తీర్పు



ఓ రాజకీయ నాయకుడు చచ్చి పై లోకాలికెళ్ళాడు. యమధర్మ రాజు ఒక్కొక్కరి చిట్టాయే తీస్తున్నాడు. ముందు ఓ ప్రభుత్వోద్యోగి వంతు వచ్చింది. "యమధర్మ రాజా ! ఇతను ప్రభుత్వోద్యోగి ! అయిన దానికీ, కాని దానికీ లంచాలు తీసుకొనేవాడు." చిత్రగుప్తుడు చెప్పాడు. "అయితే ఇతన్ని సలసల కాగుతున్న నూనెలో వేయండి...నరకానికి పంపండి.." అంటూ యమధర్మ రాజు తీర్పిచ్చాడు. తరువాత ఓ వ్యాపారి వంతు వచ్చింది.

"ఇతను కల్తీ చేసి వస్తువులు అమ్మాడు ప్రభూ! " చిత్రగుప్తుడు చెప్పాడు.
"ఇతన్ని నిప్పుల్లో వేయండి..." యమధర్మ రాజు ఆజ్ఞ ఇచ్చాడు.
చివరగా రాజకీయ నాయకుడి వంతు వచ్చింది.
"అయ్యా! ఇతను రాజకీయ నాయకుడు. మర్డర్లూ, మాన భంగాలు చేసి, ప్రతీ అయిదేళ్ళకోసారి ప్రజల్ని మోసగిస్తూ, ప్రజల సొమ్ము కాజేసే వాడు.." చిత్రగుప్తుడు నేరాల చిట్టా విప్పాడు.
"అలాగా! అయితే ఇతన్ని స్వర్గానికి పంపండి..." అంటూ యమధర్మ రాజు ఆజ్ఞా పించాడు.
ఇది చూసి ప్రభుత్వోద్యోగీ, వ్యాపారీ ఖిన్నులయ్యారు.
"యమధర్మ రాజా ! ఇది చాలా అన్యాయం ! మేం చేసిన చిన్న చిన్న వాట్లకే అంత పెద్ద శిక్షలు వేసి, మర్డర్లూ, మానభంగాలూ చేసిన ఇతనికి స్వర్గమా? ఇది అన్యాయం! ఘోరం!!.." అంటూ నెత్తీ నోరూ బాదుకున్నారు.
"కంగారు పడకండి... ఈ రాజకీయ నాయకుడు స్వర్గంలో అతని భార్యతో కలసి ఉంటాడు.." తాపీగా నవ్వుతూ చెప్పాడు యమధర్మ రాజు.

లాఫింగ్ గ్యాసు వేస్తే తప్ప  ఉపయోగం లేదు!

# ఆనందో  బ్రహ్మ

## నెలనెలా నవ్వుల విందు

- సాయి బ్రహ్మానందం గొర్తి

### ఇంతకీ ?

సత్యమంగళం అడవిలో వీరప్పన్ లాంటి మరో నరహంతకుడు బయల్దేరాడు. ప్రజల్ని దోచుకుంటూ, కనిపించిన వారిని నరుకుతూ, నానా భీభత్సం చేస్తూ, ఏలిన వారికి తలనొప్పిలా తయారయ్యాడు. ఆ నరహంతకుణ్ణి పట్టి ఇచ్చిన వారికి కోటి రూపాయిలు ఇస్తామని ప్రకటించినా ఎవరూ ముందుకు రాలేదు. బహుమతి పెంచింది ప్రభుత్వం. ఓ ముగ్గురు వ్యక్తులు 'మేం ప్రయత్నిస్తాం' అంటూ ముందుకొచ్చారు. ముగ్గుర్నీ ఒకేసారి పంపడం ఇష్టం లేక, నిజంగా ఆ ముగ్గురికీ పట్టుకునే చిత్తశుద్ధి ఉందా, లేదా అని సదరు రక్షణాధికారులు విచారించడం మొదలు పెట్టారు. మొదటి వ్యక్తిని కలసి, "మీరు నరహంతకుడ్ని పట్టుకుంటే మీకు ఎంత బహుమతి కావాలి? దాన్ని మీరేం చేస్తారు?" అని అడిగారు. దానికా మొదటి

వ్యక్తి, " నాకు పదికోట్లు కావాలి. దాంతో మా ఊళ్ళో ఓ ఇంజనీరింగ్ కళాశాల కట్టిస్తాను" అంటూ చెప్పాడు. రెండో వ్యక్తినీ ఇదే ప్రశ్నించారు. అతను, "నాకు ఇరవై కోట్లు కావాలి. అందులో సగం నా బీద కుటుంబానికి ఇస్తాను. మిగతా సగం ఉపయోగించి, మా ఊళ్ళో ఆసుపత్రి సౌకర్యం లేదు కనుక అది కట్టిస్తాను" అని జవాబిచ్చాడు. ఇహ మూడో వ్యక్తి వంతు వచ్చింది. అతను ఇంతకు ముందు వాళ్ళని అడిగిన ప్రశ్న దొంగచాటుగా

తెలుసుకున్నాడు. అధికారులు అతన్ని ప్రశ్న అడగకుండానే "నాకు ఓ ముప్ఫై కోట్లు ఇవ్వండి" అని వాళ్ళ చెవిలో మెల్లగా ఊదాడు. "ముప్ఫై కోట్లా ?" అంటూ వాళ్ళు మొహాలు వెళ్ళ బెట్టి, "దాంతో ఏం చేస్తావు?" అని తేరుకొని అడిగారు.

"చాలా సింపుల్ ! ఆ ముప్ఫై కోట్లలో రెండు కోట్లు మీ అధికారుల కిస్తాను. పద్దెనిమిది కోట్లు నేనుంచుకుని, మిగిలిన పదికోట్లతో మొదటి వ్యక్తిని అడవికి పంపుతాను." అంటూ తన ప్లాన్ చెప్పాడు.
"ఇంతకీ మీరేం చేస్తారు? "
"నేనా రాజకీయ నాయకుణ్ణి..."
అధికారులకి నోట మాట లేదు.

## స్ఫూర్తి



"మీ పర్సులో దేముడి ఫొటో పెట్టుకోరు కానీ ఎప్పుడూ నా ఫొటో పెట్టుకుంటారెందుకని?" అమాయకంగా అడిగింది సుందరి

"అవును.. నాకు ఏ కష్టమొచ్చినా నీ ఫొటో చూస్తే చాలు, నా ముందున్న సమస్యలన్నీ క్షణంలో అధిగమిస్తాను.. అందుకే పర్సులో నీ ఫొటో లేకుండా బయటకు కాలు పెట్టను. " సుబ్బారావు చెప్పాడు.

"చూసారా? నేను మీ వెనకాలే ఉంటూ పరోక్షంగా మీకు ఎంత స్ఫూర్తి నిస్తున్నానో!" సుందరి కించిత్ గర్వ పడింది.

"అవును. ఏ సమస్య వచ్చినా నీ ఫొటో కేసి చూస్తూ, 'ఈ ప్రపంచంలో దీనికంటే మించిన పెద్ద సమస్య ఉంటుందా?' అని ఒక్కసారి అనుకుంటాను. అంతే నా ముందున్న సమస్యలన్నీ చిటికలో మాయమవుతాయి.." నవ్వుతూ చెప్పాడు. సుబ్బారావు.

## శుభవార్త...



వెంకటేశం, పార్వతీశం క్రికెట్ పిచ్చాళ్ళు. ప్రతీ మ్యాచ్‌కీ ఇద్దరూ కలిసే వెళ్ళే వాళ్ళు. వీలున్నప్పుడల్లా క్రికట్ ఆడేవాళ్ళు. హఠాత్తుగా పార్వతీశానికి గుండె జబ్బొచ్చి పోయాడు. వెంకటేశం బెంగ పడ్డాడు. ఓ రోజు పార్వతీశం వెంకటేశం ముందు ప్రత్యక్షమయ్యాడు

"వెంకటేశం! నేనురా. పార్వతీశాన్ని.. బాగున్నావా? "

వెంకటేశం నమ్మలేకపోయాడు.

"నువ్వా పార్వతీశం! ఎన్నాళ్ళయ్యింది చూసి? "

"అవును.. నా గురించి బెంగ పడి క్రికెట్ మాచ్ కూడా చూడడం లేదని తెలుసుకొని పై లోకాలనుండి వచ్చాను..."

"నా గురించి పై లోకాలనుండి వచ్చావా? అక్కడ క్రికెట్ ఉందా?"

"ఒక్క వండే మ్యాచ్‌లే కాదు, టెస్ట్ మ్యాచ్‌లూ, ట్వంటీ ట్వంటీ మ్యాచ్ లూ జరుగుతాయి. నీకో విషయం తెలుసా? ఇక్కడ ప్రతీ ఏడూ వరల్డ్ కప్ జరుగుతుంది. ఇండియాలో అయితే జట్టులో స్థానం దొరకాలంటే అడ్డమైన గడప తొక్కాలి. ఇక్కడ ఆ అవసరం లేదు. ప్రతిభ ఉంటే చాలు ఎవరికైనా చోటు దొరుకుతుంది. నీకో రెండు శుభవార్తలు చెబుదామనే వచ్చాను. రేపటి నుండి ఇక్కడ జరగ బోయే వరల్డ్ కప్ మాచ్ లో నేను ఓపెనర్ గా బ్యాటింగ్ చేస్తున్నాను...ఇన్నాళ్ళ నా కల ఫలించింది.. ఇండియాలో ఒక్క మ్యాచ్ ఆడకుండా పోయాను అని దిగులు పడేవాణ్ణి... ఇదే మొదటి శుభవార్త! .."

వెంకటేశం ఆశ్చర్యపోయాడు. "అలాగా! మరి రెండోది?"

"రేపు మాచ్‌లో నువ్వే ఓపెనింగ్ బౌవులరివి...!"

వెంకటేశం కళ్ళు తేలేసాడు.

## హెల్ప్ ...



తిక్క శంకరం : డాక్టర్ గారూ! నాకు ఈ మధ్య పని ఒత్తిడి వల్ల చికాకు, కోపం విపరీతంగా పెరిగాయి. దాని వల్ల ఇబ్బందిగా ఉంది...

దయచేసి నాకు హెల్పు చేయ్యండి.

డాక్టర్ : అలాగా! ఇలా వచ్చి కూర్చోండి. ఇప్పుడు వివరంగా చెప్పండి మీ ప్రోబ్లం ఏమిటో?

తిక్క శంకరం : ఓరి బడుధ్ధాయీ! ఇప్పుడే చెప్పాను కదురా? మళ్ళా మళ్ళా అడుగుతావా? నీకు బుధ్ధుందా?

ఒక్కసారి కంగు తిన్నాడు డాక్టర్!

## యువరానర్ !



లాయర్: యువరానర్! మా ముద్దాయి.. అసలు ఈ దొంగతనం చేయలేదని మనవి చేసుకుంటున్నాను. ప్రాసిక్యూషన్ వారి అభియోగం ప్రకారం, శీను అనబడే ఈ ముద్దాయి, బాంకులో ప్రవేశించిన మాట నిజమే! కానీ ఆ లాకర్ ఓపెన్ చేసింది అతను కాదు అతని చెయ్యి.. అతని చెయ్యి అతని మనస్సు మాట వినదు. ఓ చెయ్యి చేసిన నేరానికి శరీరంలో ఉన్న మిగతా అవయవాలన్నిటినీ శిక్షించడం భావ్యం కాదు. అతని కన్ను ఈ నేరం చేయ లేదు. అతని చెవి ఈ నేరం చేయ లేదు. కాబట్టి, మిలార్డ్..మీరు కావాలంటే నా ముద్దాయి చేతిని శిక్షించండి.. కానీ అమాయకుడైన ఇతన్ని విడిచిపెట్టమని కోర్ట్ వారిని మనవి చేసుకుంటున్నాను.

జడ్జి : మీ వాదన విన్న తరువాత మీరు చెప్పింది నిజమే అనిపిస్తోంది. మీరు చెప్పినట్లుగానే అతని చేయినే శిక్షిద్దాం! అతని చేయి శరీరంతో కలిపి ఉంచుకుంటారో లేక విడిగా నరికి జైలులో ఉంచుతారో మాకు తెలియదు. అతని చెయ్యికి పాతికేళ్ళు జైలు శిక్ష విధిస్తున్నాను..

అంతే, ఒక్క క్షణం అలస్యం చేయకుండా సదరు ముద్దాయి తనకున్న అర్టిఫిషియల్ చేతిని తీసి జడ్జి గారి ముందుంచాడు.

# యమకీయం



ఓ రాజకీయ నాయకుడు బాల్చీ తన్ని యమ లోకంలో పడ్డాడు. అతన్ని. యమధర్మరాజు ముందుంచారు

"ప్రభూ! ఇతను ఓ రాజకీయ నాయకుడు. పొట్టకోస్తే అక్షరమ్ముక్క లేదు. హత్యలూ, మాన భంగాలూ లంచాలూ ఇతను చేసినవి. ప్రజల సొమ్ము ఎడాపెడా వాడుకున్నాడు. ఎంతటి వాళ్ళ నయినా ఇట్టే బుట్టలో వేసేస్తాడు. మాటల మరాఠీ! ఇతడెంత నీచుడంటే, సునామీలూ, బాంబులు పేలి జనం చచ్చిపొతే ప్రభుత్వం వారి వారి కుటుంబాలి కివ్వాల్సిన సహాయ నిధి కూడా మింగేశాడు."

యథా ప్రకారం చిత్రగుప్తుడు చిట్టా విప్పాడు.

యమ: ఈ చిత్రగుప్తుడు చెప్పినవన్నీ చేసావా?

రాజకీయ నాయకుడు: యమధర్మరాజా! క్షమించాలి. సునామీలూ, వరదలూ వచ్చినప్పుడు ప్రభుత్వం సహాయం ప్రకటించిన మాట వాస్తవమే! సునామీ బాధితులకి వంద కోట్లు, వరద బాధితులకి రెండు వందల కోట్లు, బాంబు పేలుళ్ళ బాధితులకి ఇంకో వంద కో ట్ల సహాయం ప్రకటించింది. కానీ ప్రజలకిస్తానని అనలేదు కదా న్యాయం ప్రకారం నేను వాళ్ళ సొమ్ము తిన లేదు. ప్రజా సేవ నిమిత్తమై ప్రభుత్వం దగ్గర డబ్బు తీసుకున్నాను అంతే! ప్రకటించడం, ఇస్తానని వాగ్దానం చేయడం ఒకటి కాదు కదా?

వాడి తెలివికి మతి పోయింది యముడికి .

యమ: అవును నువ్వు చెప్పిన దాంట్లో నిజముంది. కానీ ఇలా చిన్నా చితకా నేరాలు చేసిన ఎవరికైనా ఓ రోజు నరకం లోనూ, మిగతా కాలమంతా స్వర్గంలో గడిపేలా తీర్పు అని ప్రకటిస్తున్నాను....

రాజకీయ నాయకుడు యముణ్ణి కూడా బోల్తా కొట్టించానని సంబర పడ్డాడు. యమ భటులు వచ్చి, ముందుగా ఓ గంట సేపు స్వర్గానికి తీసుకెళ్ళి, ఇహ పెర్మనెంటుగా నరకంలో పడేస్తున్నామని చెప్పారు. ఇది విని రాజకీయ నాయకుడు కంగు తిన్నాడు.

"యమ ధర్మ రాజా ! ఇది అన్యాయం ! నాకు ఓ రోజు నరకం, మిగతా కాలమంతా స్వర్గం అని "ప్రకటించి ఇలా మోసం చేస్తారా?" అంటూ యమలోకం దద్దరిల్లేలా అరిచాడు. ప్రత్యక్షమయ్యాడు యమలోకాధిపతి.


"ప్రకటించడం వేరు, శిక్ష వేరు నాయనా!" అంటూ యమ రాజకీయపాఠం చెప్పాడు యముడు.

ఛ్ఛ !






# ఆనందోబ్రహ్మ



మహాపండితుడు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు బహిరంగ సభల్లో నిర్భయంగా, నిర్మొహమాటంగా మాట్లాడతారని అందరికీ తెలుసు. ఒక సారి ఒక వూళ్ళో సన్మానం చేసి, వారికి నాసిరకం శాలువా కప్పారట..అప్పుడాయన.

" నిర్వాహకులు ఈ శాలువా నాకు బహూకరించి, మా ఇంటావిడకు కూడా ఉపయోగపడేలా చేశారు.." అన్నారట. సభికులకి ఆయన ప్రసంగంలోని శ్లేష అర్థం కాలేదు. ఆయనే తన ఉపన్యాసాన్ని కొనసాగిస్తూ " ఎందుకంటే.. చాలా రోజులుగా మా ఆవిడ వడియాలు పెట్టడానికి వస్త్రం కావాలని అడుగుతోంది. ఈ శాలువా అందుకు సరిగ్గా సరిపోతుంది.." అని నర్మగర్భంగా చురక వేశారట..! సభా నిర్వాహకుల రియాక్షన్ ఎలా ఉండి ఉంటుందో మీరే ఊహించుకోండి..!





ఆంధ్రా బ్యాంకుని ప్రారంభించిన వ్యక్తి, ప్రముఖ స్వాతంత్ర్యయోధులు స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారనే విషయం చాలా మందికి తెలిసే ఉంటుంది. ఒక సారి వారికి జరిగిన సన్మాన సభలో పి.పి.భట్ అనే ఆయన 'సీతారామయ్య గారు భోగాలు అనుభవించడంలో భోగరాజు గారు, ధర్మాలు చేయడంలో ధర్మరాజు గారు, త్యాగాలు చేయడంలో త్యాగరాజు .." అంటూ మాట్లాడారట.

ఆ తరువాత సీతారామయ్య గారు .." భట్ గారు చెప్పిన వాటిల్లో ఎన్ని విశేషణాలు సరిగ్గా నాకు వర్తిస్తాయో తెలీదుకానీ ఆయన మాత్రం నన్ను పొగడ్డంలో నిజంగానే భట్‌రాజు అనిపించుకున్నారు.." అని ఛలోక్తి విసిరారట..!



ఆ మధ్యన ఊరూ పేరులేని హీరోతో ఎప్పుడు రిలీజయ్యిందో కూడా తెలీని ఒక సినిమా శతదినోత్సవం జరిగింది. ఆ సభకి హాజరైన ఒకాయనకి అనుమానం వచ్చింది ..

" ఏవండీ ..అసలు ఈ సినిమా ఎక్కడ వంద రోజులు ఆడిందీ.." అని పక్క నున్న వ్యక్తిని అడిగాడు.

"శతదినోత్సవం అంటే వందరోజులు ఆడిందని అర్ధం కాదు.. ఈ సినిమా రిలీజ్ ఐ వందరోజులైందని అర్ధం ..: అసలు రహస్యం బహిరంగంగా చెప్పాడాయన.



ఎప్పుడూ హాస్య చిత్రాలే నిర్మించే దర్శకుడిని ఒక విలేఖరి "మీరెప్పుడూ కామెడీ చిత్రాలే తప్ప ట్రాజెడీ చిత్రాలు నిర్మించలేదా? " అని అడిగాడు..

"నిర్మించకేం.. కొన్ని కామెడీ సినిమాలు రిలీజయ్యాక వాటంతటవే ట్రాజెడీగా మారతాయండీ.." అది ఆయన సమాధానం..!








ప్రివ్యూ థియేటర్ నుంచీ బయటికి వస్తున్న ఒకాయన్ని "ఏమండీ... సినిమా ఎలా నడుస్తుందంటారు.." అని అడిగాడు ఒక ఫైనాన్సియర్..

"ఓ..సినిమాకేమండీ.. 5 వీక్స్." అన్నాడాయన..


"అంత ఖచ్చితంగా ఎలా చెప్ప గలుగుతున్నారు..?"

"హీరో వీక్, హీరోయిన్ వీక్, మ్యూజిక్ వీక్, డైరెక్షన్ వీక్.. ఫోటోగ్రఫీ వీక్.. మొత్తం 5 వీక్స్ కదా..!"

"ఏమిటీ ఈ మధ్య సినిమాకి మాటలు రాస్తున్నావట..ఎలా ఉంది ఫిల్మ్ ఫీల్డ్?"
" ఓ బ్రహ్మాండంగా ఉంది.. హోటల్ బిల్ మనం కట్టాల్సిన అవసరం లేదు..వాళ్ళే కడతారు.. సిగిరెట్లు మనం కొనుక్కోవాల్సిన అవసరం లేదు..వాళ్ళే కొనిపెడతారు.. మందు మనం తెచ్చుకోవాల్సిన అవసరం లేదు..వాళ్ళే తెచ్చి పెడతారు.. డైలాగులు మనం రాయాల్సిన అవసరం లేదు..వాళ్ళే రాసుకుంటారు.."







ప్రేమ వివాహం చేసుకున్న ప్రేమ్ కుమార్‌ని ఒక పత్రికవాళ్ళు ఇంటర్వ్యూ చేస్తూ ప్రేమకీ, పెళ్ళికీ తేడా చెప్పమంటే ఆయన ఇచ్చిన సమాధానం..
ప్రేమ మత్తు పదార్థం లాంటిది..పెళ్ళి విషపదార్థం లాంటిది
ప్రేమ తుఫాను లాంటిది..పెళ్ళి ఉక్కబోత లాంటిది
ప్రేమ జలపాతం లాంటిది..పెళ్ళి మున్సిపాలిటీ కుళాయి లాంటిది..
ప్రేమ కీలు గుర్రం లాంటిది పెళ్ళి కొయ్యగుర్రం లాంటిది.. ..!
(స్థలాభావం వల్ల ప్రేమ్ కుమార్ గారి నిర్వచనాలన్నీ ఇక్కడ ప్రచురించలేక పోతున్నాం..!)



వచ్చే నెలలో మళ్ళీ వస్తా..ఖబడ్దార్..!

# ఆనందో



# బ్రహ్మ

నెలనెలా నవ్వుల విందు

- సాయి బ్రహ్మానందం గొర్తి
gorthib@yahoo.com

## స్వర్గం?

ఓ స్వామీజీ పాపపుణ్యాల గురించి ఉపన్యాసం ఇస్తున్నాడు. మంచి పనులు చేస్తే స్వర్గానికీ, చెడు పనులు చేస్తే నరకానికీ వెళతారని బోధిస్తూ, " మీలో ఎవరెవరికి స్వర్గానికి వెళ్ళాలని వుందో వాళ్ళందరూ ఈ పక్కగా వచ్చి నిలబడండి. మీరందరికీ స్వర్గ ప్రాప్తి లభించేలా నేను చేస్తాను." అని చెప్పాడు. ఉపన్యాసం వింటున్న ప్రతీ వాడూ స్వామి పక్కగా నిల్చున్నారు. కానీ స్వామీజీ ప్రియ శిష్యుడు మాత్రం అటు వైపు వెళ్ళకుండా అక్కడే నిలబడి పోయాడు. స్వామీజీకి శిష్యుడి ప్రవర్తన చూసి చెర్రెత్తు కొచ్చింది. కోపాన్ని అణచుకుంటూ, "ఏం నాయనా ! అక్కడే నిలబడి పోయావు. నీకు స్వర్గానికి వెళ్ళాలని లేదా? " అంటూ ఏమీ తెలియనట్లుగా అడిగారు.

"అదికాదు గురువర్యా, నే పోయిన తరువాత నాకూ స్వర్గానికి వెళ్ళాలనే ఉంది. వీళ్ళందర్నీ బ్రతికుండగానే స్వర్గానికి పంపేస్తారోమోనని ఆగానంతే! " శిష్యుడు తాపీగా చెప్పాడు.

## పబ్లిసిటీ



ఓ సినీ నిర్మాత, రిలీజు ముందు ఆ సినిమాకి అయిన ఖర్చు 20 కోట్లు పైగా అయ్యిందంటూ అతిగా పబ్లిసిటీ ఇచ్చాడు. కేవలం హీరోయిన్ కాస్ట్యూములకే అయిదు కోట్లయ్యాయని తెగ మార్కెటింగ్ చేసాడు. తీరా సినిమా చూస్తే, ఆ హీరోయిన్ ఏమాత్రం దాపరికం లేకుండా కురచ బట్టలేసుకొని శరీరం మీదున్న పుట్టు మచ్చల సైతం అందరూ గుర్తుంచుకునేలా కష్ట పడి నటించింది.

ఇది చూసి చిర్రెత్తిన ఓ సినీ విలేఖరి "ఏం సార్ ! హీరోయిన్ కాష్ట్యూములకే అయిదు కోట్లు ఖర్చు పెట్టారంటూ తప్పుడు ప్రచారం చేసారు. సినిమా చూస్తే హీరోయిన్ ఎక్కడా ఒక్క గజం ముక్క కూడా వంటి మీద ఉంచుకోలేదు" అని నిర్మాతని నిలదీసాడు. " అయ్యా ! అలా కురచ దుస్తుల్లో నటించడానికే హీరోయిన్ కి మేం అయిదు కోట్లు ఇచ్చాం. ఇందులో మేం అబద్ధం ఆడిందేమీ లేదు" అంటూ వాపోయాడు నిర్మాత.

## మీ నాన్న ఏం చేస్తారు?



ఓ టీచరు కొత్తగా తన క్లాసులో చేరిన విద్యార్థుల్ని పరిచయం చేసుకుంటూ, ప్రతీ విద్యార్థి వివరాలు అడిగి తెలుసుకుంటోంది.

"మా నాన్న విప్రోలో మేనేజరు. మా అమ్మ టీచరు. మేం అశోక్ నగర్ లో ఉంటాం ! చిన్నారి శ్రిజ చెప్పింది.

"మా నాన్న బిజినెస్ చేస్తారు. మా అమ్మ షాపింగ్ చేస్తుంది. మేం అమీర్ పేట లో ఉంటాం" విపుల్ చెప్పాడు.

టింకూ వంతు వచ్చింది.

"మా నాన్న మర్డర్లూ, మాన భంగాలు చేస్తాడు. బ్యాంకులు కొల్లగొడతాడు. ఇవన్నీ చేసినా మా అమ్మ నోరిప్పదు. " అంటూ టింకూ చెప్పాడు.

టీచరు టింకూ సమాధానం విని ఆశ్చర్య పోయింది. మర్నాడు టింకూ తండ్రిని రమ్మనమని కబురు పంపింది. టింకూ వాళ్ళ నాన్న వచ్చాడు. టీచరు టింకూ వాళ్ళనాన్నని పరిచయం చేసుకుంటూ "మీరేం చేస్తారు? " అని అడిగింది.

"నేనా ఏమీ చేయను. ఈ వూరి ఎమ్మెల్యేని" అంతే టీచరు నోట మాట లేదు.

## ఇదే నేనయితే...



సుబ్బారావుకి రాత్రి పూట రైలు ప్రయాణం అంటే పరమ చికాకు. నిద్రకి అస్సలు ఆపుకోలేడు. విజయవాడలో రాత్రి చెన్నై మెయిలు ఎక్కాడు. గూడురు వెళ్ళాలి. అది తెల్లవారు ఝామున ఎప్పుడో వస్తుంది. తను నిద్రకి ఆపుకోలేడని, గూడూరు రాగానే నిద్రలేపమని మరీ మరీ టీటి కి ముందుగానే చెప్పాడు. ఎక్కడ టీటి మర్చిపోతాడో అని ఓ వందనోటు కూడా విదిల్చాడు. హఠాత్తుగా సుబ్బారావుకి మెలుకువ వచ్చింది. కిటికీలోంచి చూస్తే చెన్నై వచ్చినట్లు అనిపించింది. అంతే కోపం తారాస్థాయికి వచ్చి, అందరి ముందు టీటిని నానా బూతులూ తిట్టాడు. ఇదంతా గమనిస్తున్న ఓ తోటి ప్రయాణీకుడు, " పాపం, మళ్ళా చెన్నై నుండి వెనక్కి గూడూరు వెళ్ళాలి. కోపం రాదూ, నేనయితే నాలుగు తగిలించేవాణ్ణి. సాచి లెంపకాయ కొట్టుండేవాణ్ణి. " అంటూ సానుభూతి చూపించాడు.
" చెన్నై వెళ్ళాలి మొర్రో అని సెత్తీ నోరూ బాదుకున్నా వినికుండా ఈ టీటీ గూడూరులో బలవంతంగా దింపేసిన వ్యక్తి అదే పని చేసాడు." ఇంకో ప్రయాణీకుడు మెల్లగా చెప్పాడు.

## ( సి )నిర్వచనాలు



హీరో హీరోయిన్లకు నచ్చే ప్రముఖ సిటీ : **పబ్లిసిటీ**

ప్రాచుర్యం కోసం హీరోయిన్లూ, హీరోలూ ఈ వాహనాల్లో తెగ తిరుగుతారు : **పుకార్లు**

టాలీవుడ్ లో ( అదేలెండి, తెలుగు సినిమా రంగానికి ఇంగ్లీషు ముద్దు పేరు )
ఉదయాన్నే సేవించేది: **గాసిప్**

ఏ దర్శకుడైనా సినిమా ప్రకటిస్తే, చాన్సు కావాలంటే ఆయన ఈజీగా
దొరికే చోటు: **వీడియో పార్లర్**

సినిమా వాళ్ళకి ఇష్టమైన బడి ( స్కూలు ) :

| | |
|---|---|
| **పెట్టుబడి** | ( దురద అనబడే అంటువ్యాధితో వ్యాపారం ) |
| **రాబడి** | (ముందుగా సుడి అనే బడి చిరునామా తెలియాలి ) |
| **పలుకుబడి** | ( మూవీ ఆర్టిస్టు సంఘ సభ్యత్వానికి ప్రథమ అర్హత ) |
| **ఏలుబడి** | ( ఇది ఫ్యామిలీ ప్యాక్ - అంత ఈజీ కాదు ) |
| **తీరుబడి** | ( వరుసగా రెండు ఫ్లాపులు చేతికందితే చేరే బడి) |

సినిమా వాళ్ళందరూ ఖచ్చితంగా ఇష్టపడే కళ:
(వ్యక్తిగతం గానూ, సాముహికం గానూ) **భజన**

సినిమా వారి ఇళ్ళల్లో ఏ.సి ఉండదు, ఉన్నా వాడరు ( ఎందుచేత? ) : **ఫ్యాన్సు ఎక్కువ కాబట్టి**

ప్రేక్షకులకి ఇష్టమైన అక్షరం : **S (Success)**
( సినిమా నచ్చితే **HIT** హిట్ వెనకాల, నచ్చక పోతే **HIT** హిట్ ముందు చేర్చి ఆనందిస్తారు )

సినిమా సక్సస్ మీటరు పేరు : **F G H**
( సూచిక **G** గుడ్ స్టోరీ మీదే ఉంటుంది. బాగుంటే **H** (**HIT**) వైపు ముందుకీ, చెత్తలా ఉంటే వెనక్కి **F** (**FLOP**) వైపూ చూపిస్తుంది. )

టైటిల్ కార్డ్ నుండి శుభం కార్డు వరకూ కెమెరాలో తోటి నటీనటుల జాగాలను
కబ్జా చేసే రీల్ ఎస్టేట్ వ్యాపారి: **హీరో**

ఏ బ్యాంకులోనూ పొదుపు ఖాతా లేకుండా కేవలం బట్టలను మాత్రమే
పొదుపు గా వాడే పరమ పిసినారి. సిగ్గు అనగానే ఎదుటి వాళ్ళను
ఠక్కున హత్తుకునే ఇంపోర్టెడ్ అయస్కాంతం: **హీరోయిన్**

దురదని పోగొట్టుకోడానికి ఏభై రూపాయిల జాలిమ్ లోషన్ కి బదులు
కరెన్సీ నోట్లతో గోక్కొని తృప్తి పడేవాడు. **నిర్మాత**

నిర్మాత సొమ్ముని రీ ( నీ )ళ్ళలా ఖర్చు పెట్టేవాడు.
ఏం తీసుకుంటారు అంటే "హాలీవుడ్ బ్రాండు" అని తడుముకోకుండా చెప్పేవాడు. **దర్శకుడు**

వెయిటింగ్ లేకుండా వేడి వేడిగా కొలంబియా, ఫ్రెంచ్ కా(ఫీ)పీ లందించే స్టార్ బక్స్
ఓనరు. పక్కవాడి రాతల్ని కళ్ళతో జెరాక్స్ తీసే కాపీ రైటరు. **కథారచయిత**

ఎలాంటి పాటనైనా **ఐ పాడ్** తో పలికించేవాడు: **సంగీత దర్శకుడు**

అచ్చొచ్చిందని సింహ ద్వారం వదిలి బాత్రూం గుండా బయటకు వచ్చి
సింగర్ కుట్టు మిషన్లా సౌండు చేసేవాళ్ళు. **గాయకులు**

సినిమా అనుకున్న బడ్జెట్ లో పూర్తి కావాలంటే నిర్మాత
తప్పని సరిగా సహాయం కోరే వ్యక్తి **హీరోయిన్ తల్లి**

సినిమారంగంలో సక్సెస్ కావాలంటే కావాల్సిన డిగ్రీ : **మాస్టర్ ఆఫ్ బటరాలజీ**

ఏడాది పాటు ఓపిగ్గా నా ట్రీట్మెంట్ భరించారు. మీరే గెలిచారు!
కనీసం ఇప్పుడైనా నవ్వండి!... ప్లీజ్...

